అనుదినం జనపక్షం
www.navatelangana.com
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్, నిర్మల్, మంచిర్యాల
కుమురం భీం-ఆసిఫాబాద్

మంగళవారం 01 ఆగస్టు 2023

15వ రోజుకు రిలే నిరాహార దీక్షలు

నవతెలంగాణ-బోథ్



మండలాన్ని రెవెన్యూ డివిజన్‌గా ఏర్పాటు చేయాలని సాధన సమితి ఆధ్వర్యంలో చేపడుతున్న రిలే నిరాహార దీక్షలు సోమవారం 15వ రోజుకు చేరాయి. సోమవారం దీక్షలో మండల కేంద్రానికి చెందిన విశ్వకర్మ విశ్వబ్రాహ్మణ సంఘ సభ్యులు కూర్చున్నారు. దీక్షకు సర్పంచ్ సురేందర్ యాదవ్‌తో పాటు బీఆర్ఎస్ ఆర్గనైజింగ్ కార్యదర్శి చిలుకూరి నరేందర్, యువశక్తి యూత్ అధ్యక్షుడు తుల హరీస్, ఉపాధ్యక్షుడు గాజుల సుగుణాకర్, సభ్యులు గొల్లపల్లి సందీప్, మండల కేంద్రానికి చెందిన నీల లింగారెడ్డి మద్దతు పలికారు. రెవెన్యూ డివిజన్ సాధించేంతవరకు ఉద్యమం ఆపేది లేదని పేర్కొన్నారు. కార్యక్రమంలో అఖిలపక్ష నాయకులు పాల్గొన్నారు.

వర్షాలతో నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

నవతెలంగాణ-సిరికొండ



ఎడతెరపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలతో నష్టపోయిన రైతులను రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలని ఎంపీపీ పెందూర్ అమృత్‌రావ్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఆరుగాలం కష్టపడి పంటలు పండించే రైతులు భారీ వర్షాలతో నష్టపోయారని తెలిపారు. అధికారులు సర్వే నిర్వహించి నష్టపోయిన వారికి నష్టపరిహారం అందేలా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో బిజెపి మండల అధ్యక్షుడు అమూల్, కన్నపూర్ సర్పంచ్ రఘురాం, రిమ్మ సార్మేడి అమృత్‌రావ్, నాయకులు లచ్చు, రవి, రోహిదాస్ పాల్గొన్నారు.

మణిపూర్‌లో శాంతి నెలకొల్పాలి

- కేంద్రప్రభుత్వం వెంటనే జోక్యం చేసుకోవాలి
- అఘాయిత్యాలకు పాల్పడిన దోషులను శిక్షించాలి
- అఖిలపక్ష పార్టీలు, ప్రజాసంఘాల డిమాండ్
- బాధితులకు సభ్యసమాజం అండగా నిలవాలని పిలుపు

నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి



మణిపూర్‌లో చెలరేగిన హింసను వెంటనే అదుపు చేసి శాంతిని నెలకొల్పాలని అఖిలపక్ష పార్టీలు, ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశాయి. ఇందుకు కేంద్రప్రభుత్వం జోక్యం చేసుకొని వెంటనే అక్కడ జరుగుతున్న హింసాకాండను నివారించాలని స్పష్టం చేశారు. బాధితులుగా మారిన మణిపూర్ ఆదివాసులకు సభ్య సమాజం అండగా నిలువాలని పిలుపునిచ్చారు. వెంటనే దోషులను శిక్షించాలని స్పష్టం చేశారు. ఆదివాసీలపై జరుగుతున్న దాడులను తీవ్రంగా ఖండిస్తున్నట్లు పేర్కొన్నారు. సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో సోమవారం స్థానిక సుందరయ్య భవనంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్, కాంగ్రెస్, సీపీఐ, బీఎస్పీ, వైఎస్ఆర్‌టీపీ పార్టీలతో పాటు సీఐటీయూ, ఏఐటీయూసీ, ఐఎన్టీయూసీ, కేవీపీఎస్, ఐద్వా, న్యూడెమోక్రసీ తదితర ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మణిపూర్‌లో ఇటీవల మహిళలపై ఘటనలను ముక్త కంఠంతో ఖండిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ సమావేశానికి అధ్యక్షత వహించిన సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి దర్శనాల మల్లేష్ మాట్లాడుతూ మణిపూర్‌లో జరిగిన ఘటన సభ్య సమాజం సిగ్గుపడేలా ఉన్నాయని తెలిపారు. ఆర్ఎస్ఎస్, బీజేపీ ప్రణాళికలో భాగంగానే ఈ దాడులు జరిగాయని పేర్కొన్నారు. అక్కడి కొండలపై నివసిస్తున్న ఆదివాసులను వెళ్లగొట్టి అక్కడి ఖనిజ సంపదను కార్పొరేట్లకు దారాదత్తం చేసేందుకు కుట్ర పన్నుతున్నారని మండిపడ్డారు. ఇప్పటికే 39 కంపెనీలతో ఒప్పందం కుదిరిందని.. కానీ అక్కడ 170చట్టం అమల్లో ఉండటంతో ఖనిజ సంపద తరలించడం సాధ్యం కావడం లేదని అక్కడి నుంచి ఆదివాసులు వెళ్లిపోతే వారి పని సులువు అవుతుందనే ఉద్దేశంతోనే ఈ ఘటనలు జరుగుతున్నాయని చెప్పారు. మెయితీలను రెచ్చగొట్టి ఆదివాసులతో దాడులు చేయిస్తోందన్నారు. మెయితీలను ఎస్టీ జాబితాలో చేర్చితే ఆదివాసుల మనుగడ ప్రశ్నార్థకమవుతుందని పేర్కొన్నారు. మణిపూర్‌లో గొడవలు జరుగుతున్నా ప్రధాని మోదీ, హోంమంత్రి అమిత్‌షా మౌనంగా ఉన్నారని దుయ్యబట్టారు. ఈ ఘటనలపై అమెరికా కూడా స్పందించిందని సుప్రీంకోర్టు జోక్యం చేసుకునే వరకు ప్రధాని స్పందించలేదని పేర్కొన్నారు. ఇలాంటి ఘటనలు చాలా జరిగాయని అక్కడి సీఎం చెప్పడం శోచనీయమన్నారు. దేశంలో 80శాతం మంది ప్రజాతంత్ర వాదులే ఉన్నారని ఈ ఘటనలపై తీవ్రంగా ఖండించాల్సిన అవసరం ఉందని వివరించారు. అనంతరం వివిధ పార్టీలు, ప్రజా సంఘాల నాయకులు మాట్లాడారు. మణిపూర్ హింసా కాండలో కేంద్రం అవలంభిస్తున్న వైఖరిపై తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. అక్కడ అన్యాయానికి గురవుతున్న ఆదివాసులకు దేశమంతా అండగా ఉండాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో బీఎస్పీ జిల్లా ఇంఛార్జి రమేష్, ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు మునిగెల నర్సింగ్, రైతు సంఘం నాయకులు కొండ రమేష్, బండి దత్తాత్రి,లోకారి పోశెట్టి, రైతు స్వరాజ్య వేదిక జిల్లా అధ్యక్షుడు సంగెపు బొర్రన్న, అంబేడ్కర్ మెమోరియల్ గౌరవ అధ్యక్షుడు దుర్గం శేఖర్, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు బొజ్జ ఆశన్న, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి సిర్ర దేవేందర్, ఐద్వా నాయకురాలు కొలిపాక లలిత, సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథ పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎస్.సాయికుమార్, కె.అశోక్, జగన్‌సింగ్, వివిధ ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

కేంద్రం వైఖరి సరికాదు

- ముడుపు ప్రభాకర్‌రెడ్డి, సీపీఐ జిల్లా కార్యదర్శి



మణిపూర్‌లో జరిగిన హింసాకాండపై కేంద్రప్రభుత్వం వ్యవహరిస్తున్న వైఖరి ఏ మాత్రం సరికాదు. అక్కడ ఆదివాసీ మహిళలపై అఘాయిత్యాలు జరగడం అత్యంత దారుణం. దేశాన్ని కలిచివేసిన ఈ ఘటనపై కేంద్రం త్వరగా స్పందించకపోవడం శోచనీయం. ఇరువర్గాల ఘర్షణలతో మణిపూర్ రగిలిపోతున్నా కేంద్రం నివారణ చర్యలు చేపట్టడం లేదు. కొండ ప్రాంతాల్లో నివసిస్తున్న ఆదివాసులను వెళ్లగొట్టేందుకే కుట్రలు జరుగుతున్నాయి. కేంద్రం వెంటనే జోక్యం చేసుకొని ఆదివాసులకు రక్షణ కల్పించాలి. హింసాకాండను నివారించాలి.

సభ్య సమాజం తలదించుకొనే ఘటన

- గండ్రత్ సుజాత, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి



మణిపూర్‌లో ఇటీవల జరిగిన ఘటన సభ్య సమాజం తలదించుకునేలా ఉంది. మహిళలను పూజించే ఈ దేశంలో ఇలాంటి ఘటనలు జరగడం దురదృష్టకరం. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ రాజకీయ లబ్ధి కోసం మతతత్వాన్ని రెచ్చగొడుతోంది. దేశంలో ఇలాంటి ఘటనలకు తావుండకూడదు. సైనికుడి భార్యకు అన్యాయం జరిగినా ప్రధాని స్పందించకపోవడం దారుణం. మణిపూర్ దోషులను శిక్షించే వరకు పార్టీ వారికి అండగా ఉంటుంది.

అమాయక గిరిజనులకు అన్యాయం

- బెజ్జంకి అనిల్‌కుమార్, వైఎస్ఆర్‌టీపీ జిల్లా అధ్యక్షుడు



మణిపూర్‌లో జరుగుతున్న హింసాత్మక ఘటనల కారణంగా అమాయక గిరిజనులు అన్యాయానికి గురవుతున్నారు. ఈ రాష్ట్రం విషయంలో కేంద్రప్రభుత్వం అవలంభిస్తున్న విధానం ఏ మాత్రం సరికాదు. కేవలం రాజకీయ లబ్ధి కోసం జరుగుతున్న ఈ హింసను కేంద్రం జోక్యం చేసుకొని వెంటనే ఆపాలి. పార్టీ పరంగా ఆదివాసులకు అండగా ఉంటాం.

ఖనిజ సంపదను కార్పొరేట్లకు అప్పగించే కుట్ర

- విజ్జగిరి నారాయణ, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు



మణిపూర్‌లోని కొండ ప్రాంతాల్లో ఉన్న ఖనిజ సంపదను కార్పొరేట్లకు అప్పగించే కుట్రలో భాగంగానే ఈ ఘటనలు జరుగుతున్నాయి. దాడుల కారణంగా అక్కడి ఆదివాసులు చాలా మంది వలస వెళ్తున్నారు. ఇది ప్రజాస్వామ్యంపై దాడిలాంటిదే. బీజేపీ దేశమంతా డబుల్ ఇంజిన్ సర్కారు ఉండాలని చెబుతోందని కానీ మణిపూర్‌లో ఉన్నది అదే ప్రభుత్వం కాదా ఎందుకు హింసను ఆపలేకపోతున్నారు. అక్కడి ఆదివాసులకు అందరూ అండగా ఉండి ప్రజాస్వామ్యాన్ని రక్షించాలి.

విద్యార్థుల బాగోగులు తెలుసుకున్న న్యాయమూర్తి



నవతెలంగాణ-జైపూర్

మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల విద్యార్థుల ఆరోగ్య పరిస్థితులను చెన్నూర్ మున్సిఫ్ సివిల్ కోర్టు న్యాయమూర్తి సీహెచ్ సంపత్ అడిగి తెలుసుకున్నారు. పాఠశాల విద్యార్థులు కండ్ల కలకతో బాధపడుతున్నట్లు వచ్చిన వార్త కథనాలతో సోమవారం గురుకుల పాఠశాలను సందర్శించారు. ప్రస్తుతం ఏడుగురు విద్యార్థులు మాత్రమే కండ్ల కలకతో బాధపడుతున్నట్లు తెలుసుకున్నారు. కండ్ల కలకతో విద్యార్థులు బాధపడుతున్నట్లు తెలిసిన వెంటనే క్యాంపు ఏర్పాటు చేసి వైద్య సేవలు అందించినట్లు మెడికల్ ఆఫీసర్ అనిల్‌కుమార్ వివరించారు. వైరస్ గుర్తించిన వెంటనే విద్యార్థులకు ప్రత్యేక వైద్య సేవలు అందించామని పాఠశాల ప్రిన్సిపాల్ వివరించారు. ప్రస్తుతం ఆందోళన పడాల్సిన అవసరం లేదని, విద్యార్థుల ఆరోగ్యం కుదుటపడిందని తెలిపారు. కేవలం ఏడుగురు విద్యార్థులకు మాత్రమే వైరస్ అంటుకుని ఉన్నట్లు తెలుసుకున్నారు. విద్యార్థుల బాగోగుల పట్ల జాగ్రత్తగా ఉండాలని ఆదేశించారు. న్యాయమూర్తి వెంట సాంఘిక సంక్షేమ శాఖ రీజినల్ డైరెక్టర్ స్వరూప రాణి, ఎస్సై ఉపేందర్‌రావు ఉన్నారు.

వ్యాధి తీవ్రతను అడిగి తెలుసుకున్న తహసీల్దార్

కలెక్టర్ బాదావత్ సంతోష్ ఆదేశాల మేరకు తహసీల్దార్ మోహన్‌రెడ్డి సోమవారం గురుకుల పాఠశాలను సందర్శించారు. కండ్ల కలకతో బాధపడుతున్న విద్యార్థుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు ఎప్పటికప్పుడు వైద్య పరీక్షలు నిర్వహిస్తూ వైద్య సేవలు అందించేలా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

పోడు భూములకు హక్కు పత్రాలివ్వాలి

- టీఏజీఎస్ జిల్లా కార్యదర్శి ఎర్మ పున్నం

నవతెలంగాణ-నస్పూర్

జిల్లాలో ఆదివాసుల పోడు భూములకు హక్కు పత్రాలు ఇవ్వాలని తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి ఎర్మ పున్నం డిమాండ్ చేశారు. గిరిజన సంఘ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ముందు సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పోడు సాగులో ఉన్న ప్రతి ఒక్కరికి హక్కు పత్రాలు ఇవ్వాలని, పత్రాలు ఇవ్వడం కోసం అనేక గ్రామాలను ఇప్పటికే గుర్తించలేదని అన్నారు. కొన్ని గ్రామాలలో ఆర్ఓఎఫ్ఆర్ కమిటీలు వేసి సర్వే చేసినప్పటికీ పూర్తిస్థాయిలో హక్కు పత్రాలు ఇవ్వలేదని వాపోయారు. హక్కు పత్రాలు వచ్చిన వారిలో పూర్తి విస్తీర్ణానికి హక్కు పత్రాలు ఇవ్వలేదని తెలిపారు. వెంటనే ఆర్ఓఎఫ్ఆర్ కమిటీలు లేని చోట కమిటీలు వేసి రీ సర్వే చేయాలని, సర్వే చేసి హక్కు పత్రం రాని వారికి వెంటనే హక్కు పత్రాలు అందించాలని తెలిపారు. రావలిసిన దానికన్నా తక్కువ విస్తీర్ణానికి హక్కు పత్రాలు వచ్చిన వారికి వెంటనే రీ సర్వే చేసి హక్కు పత్రాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు భాగాల రాజన్న, జిల్లా నాయకురాలు లక్ష్మి శ్రావణ్, ఆసిఫాబాద్ జిల్లా నాయకురాలు మడే శైలజ, రెడ్డి సంపత్, శ్రీనివాస్, మల్లేష్, వనిత, మల్లీశ్వరి, తిరుపతి, కిష్టమ్మ వివిధ గ్రామాల రైతులు పాల్గొన్నారు.

కంది సమక్షంలో కాంగ్రెస్‌లో చేరికలు



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

కాంగ్రెస్ నాయకులు కంది శ్రీనివాసరెడ్డి సమక్షంలో పార్టీలో భారీ సంఖ్యలో చేరికలు జోరందుకుంటున్నాయి. ఇందులో భాగంగా సోమవారం పట్టణంలోని ప్రజాసేవా భవన్‌లో ఆదిలాబాద్ రూరల్ మండలం పరిధిలోని పలు గ్రామాల నుండి వచ్చిన గ్రామస్తులు, యువకులు కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. వారికి కంది శ్రీనివాసరెడ్డి కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానం పలికారు. ఎమ్మెల్యే జోగు రామన్నను చిత్తు చిత్తుగా ఓడించడానికి నడుం బిగించాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఎమ్మెల్యే ప్రజల ద్రోహిగా ముద్రపడ్డారని ఆరోపించారు. అనేక సర్వేల్లో కంది శ్రీనివాస్‌రెడ్డి ఆదిలాబాద్ గడ్డమీద కాంగ్రెస్ జెండా ఎగరేయబోతున్నారని తెలిసి భయబ్రాంతులకుగురై కుట్రలకు తెరలేపారని మండిపడ్డారు. ప్రజా సమస్యలపై ప్రశ్నిస్తే తనపై క్రిమినల్ కేసులు పెట్టించడానికి సిద్ధమవుతున్నాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్ని కేసులు పెట్టినా భయపడేదేలేదన్నారు. కార్యక్రమంలో గిమ్మ సంతోష్, నాగర్కర్ శంకర్, షకీల్, ఐఎన్‌టియుసి జిల్లా అధ్యక్షులు కొందూరి రవి, మైనారిటీ టౌన్ ప్రెసిడెంట్ మోసిన్ పటేల్, మానే శంకర్, లింగన్న, ముఖీమ్, షేక్ షాహిద్, ప్రకాష్‌రెడ్డి పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ రైతు బీమా చేసుకోవాలి



నవతెలంగాణ-కోటపల్లి

మండలంలోని వెంచపల్లి, సూపాక గ్రామాల రైతుల పత్తి పంటను ఏఈఓ వైష్ణవి సోమవారం పరిశీలించారు. ఇటీవల భారీ వర్షాలకు మునిగిన పత్తి పంటను పరిశీలించారు. రైతులతో పంట నష్టం వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వైష్ణవి మాట్లాడుతూ ప్రతి రైతు రైతు బీమా చేసుకోవాలన్నారు. కొత్తగా పట్టా పాస్‌బుక్ పొంది రైతుబీమా చేసుకోని వారు ఆగస్టు 5లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సూపాక సర్పంచ్ కాసెట్టి సతీష్ పాల్గొన్నారు.

వంటావార్పుతో నిరసన

నవతెలంగాణ - దహెగాం



గ్రామ పంచాయతీ కార్మికులు సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సమ్మెలో భాగంగా సోమవారం వంటావార్పు చేసి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షుడు సెండ రమేష్ మాట్లాడుతూ పంచాయతీలో అన్ని కార్యక్రమాలను విజయవంతం చేసేందుకు తమను ఉపయోగించుకునే ప్రభుత్వం సమస్యలను పరిష్కరించాలని కోరితే పట్టించుకోకపోవడం దారుణమన్నారు. కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి జుమ్డి రవీందర్, కోశాధికారి కామెర రాజ్‌కుమార్‌తో పాటు కార్మికులు గడ్డం ప్రభాకర్, సాయికృష్ణ, మారుతి, వినేష్, అశోక్, దామాజీ పాల్గొన్నారు.

ముధోల్ : సమస్యలు పరిష్కరించాలని కోరుతూ జీపీ కార్మికులు సమ్మె చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని జనసేన ఉమ్మడి జిల్లా నాయకులు సుంకెట మహేష్‌బాబు అన్నారు. సోమవారం సమ్మెకు మద్దతు తెలిపి మాట్లాడుతూ స్వాతంత్రం వచ్చినప్పటి నుండి పంచాయతీ వ్యవస్థ ఉందన్నారు. బంగారు తెలంగాణలో మాత్రం జీతాల కోసం సమ్మెలు చేయాల్సిన పరిస్థితి దాపురించిందని వాపోయారు. సమ్మెతో గ్రామాల్లో చెత్త పేరుకుపోయిందన్నారు. వర్షా కాలంలో ప్రజలకు ఇబ్బంది కలిగి రోగాన బారిన పడితే ప్రభుత్వమే బాధ్యత వహించాల్సి వస్తుందని తెలిపారు. ప్రభుత్వం వెంటనే కార్మికులకు కనీస వేతనం చెల్లించి పర్మినెంట్ చేయాలని, ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలని, అర్హులైన వారిని కారోబార్, బిల్ కలెక్టర్‌గా నియమించాలని డిమాండ్ చేశారు.

ఆసిఫాబాద్ : డిమాండ్లు పరిష్కరించాలని గ్రామపంచాయతీ కార్మికులు 25 రోజులుగా చేస్తున్న సమ్మె కొనసాగుతోంది. సోమవారం సమ్మెకు ఏఐటియుసి జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు దివాకర్, ఉపేందర్ మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా గ్రామపంచాయతీ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్ మాట్లాడుతూ గ్రామపంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం సమస్య పరిష్కారం కోసం చర్య తీసుకోవాలని, వివిధ రకాలుగా నిరసన చేస్తున్నట్లు వివరించారు. మల్టీ పర్పస్ విధానాన్ని రద్దు చేయాలన్నారు. పంచాయతీ కార్మికులకు మున్సిపాలిటీ కార్మికుల మాదిరి రూ.18వేలు చెల్లించాలని, పిఎఫ్, ఈఎస్ఐ సౌకర్యంతో ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. మరణించిన గ్రామపంచాయతీ కార్మికుడికి రూ.10లక్షల ఇన్సూరెన్స్ కల్పించాలని కోరారు. అర్హత గల వారిని గ్రామపంచాయతీలో ఉద్యోగులుగా నియమించాలన్నారు. న్యాయమైన డిమాండ్ల పరిష్కారం కోసం ప్రభుత్వం చొరవ తీసుకోవాలని కోరారు. లేనట్లయితే అసెంబ్లీని ముట్టడిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో గ్రామపంచాయతీ కార్మికులు రాజు, సమ్మయ్య, శంకర్, మహేష్, సాబీర్, నగేష్, విలాస్, కైలాస్, యమునబాయి, పద్మ పాల్గొన్నారు.



ప్రతి వర్షపు నీటి బొట్టును ఒడిసిపట్టుకోవాలి

- నిర్మల్ కలెక్టర్ వరుణ్‌రెడ్డి

నవతెలంగాణ-దిలావర్‌పూర్



మండల కేంద్రంలో సోమవారం లిమ్కా బుక్ రికార్డ్ కొరకు జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో వర్షపు నీటి బొట్టు ఒడిసిపట్టు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటి పైకప్పు వర్షపు నీరు ఒడిసి పట్టడం కొరకు ఇంకుడు గుంతల నిర్మాణం పనులను ప్రారంభించి, పూర్తిచేసే మహత్తర కార్యక్రమాన్ని చేపట్టారు. అనంతరం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కలెక్టర్ వరుణ్‌రెడ్డి అదనపు కలెక్టర్‌తో కలిసి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి నీటిబొట్టును ఒడిసిపట్టాలని, జలమే జీవకోటికి ఆధారమని, నీరు లేని చోట జీవుల మనుగడ కష్టమని పేర్కొన్నారు. నీటిని సంరక్షిస్తేనే ముందుతరాలకు భరోసా ఇచ్చిన వారమవుతామని తెలిపారు. వర్షపు నీటిని సద్వినియోగం చేసుకోవాలని, ప్రతి వర్షపు బొట్టుని ఒడిసిపట్టి అవసరం ఉన్నప్పుడు వినియోగించుకునేందుకు ఇంకుడు గుంతలు ఉపయోగపడతాయని పేర్కొన్నారు. భావితరాలకు నీటి సమస్య ఏర్పడకుండా జలధారను పొదుపుగా వాడుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిఆర్డిఓ విజయలక్ష్మి, ఎంపిపి పాల్దె అక్షర అనిల్, జడ్పికోప్షన్ సభ్యులు యు.సుభాష్‌రావు, సర్పంచ్ వీరేష్‌కుమార్, తహసీల్దార్ కరీం, ఎంపీడీఓ మోహన్, ఎంపీఓ అజీజ్‌ఖాన్, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

మైనార్టీలు ప్రభుత్వ సాయం సద్వినియోగం చేసుకోవాలి

నవతెలంగాణ-ఆసిఫాబాద్

రాష్ట్ర ప్రభుత్వం ముస్లిం క్రిస్టియన్ మైనార్టీలకు అందిస్తున్న లక్ష రూపాయల పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎంఐఎం అధ్యక్షుడు సల్మాన్‌ఖాన్ తెలిపారు. సోమవారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ లక్ష సహాయం కోసం ఇప్పటికే మైనార్టీలు కొంతమంది దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. క్రిస్టియన్ మైనార్టీలు కూడా దరఖాస్తు చేసుకోవాలన్నారు. గతంలో దరఖాస్తు చేసిన ముస్లిం మైనార్టీలు మళ్లీ దరఖాస్తు చేయాల్సిన అవసరం లేదని సూచించారు. క్రిస్టియన్ మైనారిటీలు ఆగస్టు 14లోపు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ముస్లిం క్రిస్టియన్ మైనారిటీలు దరఖాస్తు చేసుకోవడానికి మజ్లిస్ పార్టీ కార్యాలయం (దారుస్సాలాం) బజార్‌వాడిలో ఉచిత ఆన్లైన్ దరఖాస్తు సేవలు అందించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ ప్రధాన కార్యదర్శి కశిఫ్ హష్మీ, నాయకులు పాల్గొన్నారు.

భారీ వర్షాలతో నష్టపోయిన రైతులను ఆదుకోవాలి



నవతెలంగాణ-తలమడుగు

వారం రోజుల క్రితం నుండి ఏకధాటిగా కురుస్తున్న భారీ వర్షాలతో నష్టపోయిన పత్తి, సోయా, కంది పంటలకు నష్టపరిహారం చెల్లించాలని రైతులు సోమవారం డిప్యూటీ తహసీల్దార్ సంతోష్‌కుమార్‌కు వినతి పత్రం అందజేశారు. విపత్తు నిర్వహణ చట్టం 2005 సెక్షన్ 30 ప్రకారం రైతులకు నష్టపరిహారం చెల్లించి న్యాయం చేయాలని వినతిపత్రంలో పేర్కొన్నారు. మండలంలోని అనేక గ్రామాల్లో వాగులు వంకలు ఉప్పొంగి పంటలు నీట మునిగాయన్నారు. భారీ వర్షానికి పొలాలు కోతకు గురి కావడంతో మానసికంగా ఆందోళన చెందుతున్నామని తెలిపారు. వినతి పత్రం అందజేసిన వారిలో రైతులు నల్ల పద్మాకర్‌రెడ్డి, శంకర్, రమాకాంత్, నాగన్న, లచ్చన్న, భూమన్న, మేకల రమాకాంత్, కిషన్‌రావు, నర్సారెడ్డి ఉన్నారు.

విద్యుత్ ఆదాకు ఎల్ఈడీ బల్బులు

నవతెలంగాణ-ముధోల్

విద్యుత్ ఆదా చేయడానికి ఎల్ఈడి బల్బులు ఉపయోగించాలని ముధోల్ సర్పంచ్ వెంకటాపూర్ రాజేందర్ అన్నారు. సోమవారం తెలంగాణ రాష్ట్ర పునరుత్పాదక ఇంధనాభివృద్ధి సంస్థ ప్రాజెక్ట్ షైన్ ప్రోగ్రాంలో భాగంగా ఐసిఎల్ బల్బులు వాడటం వల్ల ప్రజలపై విద్యుత్ భారం పడుతుందని, దీన్తో ఎల్ఈడి బల్బుల వినియోగం పెంచి కార్యక్రమాన్ని చేపట్టారు. సర్పంచ్ వెంకటపూర్ రాజేందర్ చేతుల మీదుగా ఎల్ఈడి బల్బులు అందించే కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం ఐసిఎల్ బలుపుల వల్ల పేద మధ్యతరగతి ప్రజలపై విద్యుత్ భారం పడుతుందన్నారు. దీంతో ప్రాజెక్ట్ షైన్ ప్రోగ్రాంలో భాగంగా నిర్మల ఎంటర్‌ప్రైజెస్ వారు ప్రజలకు ఐదు బల్బులు 125 రూపాయలకు మాత్రమే అందిస్తున్నారన్నారు. ప్రజల సౌకర్యార్థం మూడు రోజులపాటు గ్రామంలో ఎల్ఈడీ బల్బుల విక్రయాలు కొనసాగుతాయని తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా కంపెనీ పై కార్యక్రమాన్ని చేపట్టిందన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ సంజు, కంపెనీ ప్రతినిధులు మహేష్, నాయకులు జమీల్ పాల్గొన్నారు.

కోర్టుకు హాజరైన మల్లాపూర్ ఆదివాసులు

నవతెలంగాణ-సిరికొండ



చట్టబద్ధత లేని లంబడాలను తొలగించాలని చేసిన ఉద్యమంలో భాగంగా వారిపై పెట్టిన కేసుల విషయంలో బోథ్‌లోని సివిల్ కోర్టుకు సోమవారం మండలంలోని మల్లాపూర్ ఆదివాసీలు మెజిస్ట్రేట్ ముందు హాజరయ్యారు. వీరిపై పెట్టిన కేసులను ఆదివాసీ అడ్వొకేట్ పంద్రం శంకర్ వాదించాడు. కేసుల్లో పాల్గొన్న ఆదివాసులు దుర్వ రాజు, ఆత్రం భీంరావ్, ఆనంద్‌రావ్, హరిదాస్, జ్యోతిరామ్, లక్ష్మణ్, బొజ్జు, దినేష్ ఉన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్‌ను తొలగించాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్ రూరల్

మండలంలోని పొచ్చర గ్రామంలో సోమవారం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఆవరణలో ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ప్రమాదకరంగా మారిందని, దీంతో నిత్యం పాఠశాలకు వచ్చే విద్యార్థులు అటుగా వెళ్లే క్రమంలో ఏదైనా ప్రమాదం జరిగే అవకాశాలున్నాయని అన్నారు. పాఠశాల ఆవరణలో విద్యార్థులు మరుగుదొడ్లకు వెళ్లే మార్గంలో ఉన్న ఈ ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ కంచ వేసినప్పటికీ సపోర్టు వైర్లకు విద్యుత్ సరఫరా అవుతుందని పాఠశాల ఉపాధ్యాయులు పేర్కొన్నారు. ట్రాన్స్‌ఫార్మర్‌ను తొలగించాలని కోరారు. ఇప్పటికైనా ముందస్తు చర్యల్లో భాగంగా ట్రాన్స్‌ఫార్మర్‌ను తొలగించాలని విద్యార్థులు, తల్లిదండ్రులు, గ్రామస్తులు కోరుతున్నారు.



నష్టపోయిన పంటలకు పరిహారం అందించాలి

నవతెలంగాణ-బాసర

నష్టపోయిన పంటలకు పరిహారం అందించాలని బీజేపీ నిర్మల్ జిల్లా అధ్యక్షురాలు పడకంటి రమాదేవి అన్నారు. సోమవారం మండలంలోని లాబ్ది, దొడాపూర్ గ్రామాలను పార్టీ నాయకులతో కలిసి సందర్శించారు. వర్షాలకు దెబ్బతిన్న రోడ్లను, ఇండ్లను పరిశీలించారు. అధిక వర్షాలకు సోయా, పత్తి పంట నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.25 వేల నష్టపరిహారం అందించి ఆదుకోవాలని అన్నారు. రహదారి మరమ్మతులను వెంటనే పూర్తి చేయాలని ఆమె డిమాండ్ చేశారు. వీరి వెంట మండల బీజేపీ అధ్యక్షుడు లక్ష్మారెడ్డి, మాధవరావు పటేల్, తిరుపతి, నాగనాథ్, మారుతి పటేల్ పాల్గొన్నారు.

విద్యార్థులకు సైంటిఫిక్ క్యాలిక్యులేటర్ అందజేత

నవతెలంగాణ-బాసర

ఆర్జీయూకేటీ యూనివర్సిటీకి ఎంపికైన విద్యార్థులకు సోమవారం కౌట ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు గంగాకిషన్ 11 మంది విద్యార్థులకు సైంటిఫిక్ క్యాలిక్యులేటర్ అందజేశారు. ఇంజనీరింగ్ చదివే విద్యార్థులకు ఈ క్యాలిక్యులేటర్ ఎంతో గాను ఉపయోగపడుతుందని అన్నారు. ఉపాధ్యాయుడు గంగాకిషన్ తెలిపారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సకాలంలో వరి నాట్లు వేసుకోవాలి



నవతెలంగాణ-సారంగాపూర్

సకాలంలో వరి నాట్లు వేసుకోవాలని ఎంపీపీ మహిపాల్‌రెడ్డి జెడ్పీటీసీ పత్తిరెడ్డి రాజేశ్వర్‌రెడ్డి డీసీసీ డైరెక్టర్ నారాయణరెడ్డి, ఎఎంసీ చైర్‌పర్సన్ ఆశ్రిత శ్రీనివాస్ రెడ్డిలు అన్నారు. సోమవారం వానాకాలం వరి పంటకు స్వర్ణ ప్రాజెక్ట్ ఎడమ, కుడి కాల్వల ద్వారా నీటిని విడుదల చేశారు. స్వర్ణ ఆయకట్టు రైతులు నీటిని సద్వినియోగం చేసుకొని, వరిపంట దిగుబడిని పెంచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నాయకులు రాజ్ మహమ్మద్, మాధవ్‌రావు, మల్లేష్, హదీ, నీటి పారుదల శాఖ అధికారులు, రైతులు పాల్గొన్నారు.

పాఠశాలను ప్రారంభించిన ఐటీడీఏ ఏపీఓ



నవతెలంగాణ-సిరికొండ

మండలంలోని సుంకిడి గ్రామపంచాయతీ పరిధిలోని కోసుపటేల్ గూడ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను సోమవారం ఐటీడీఏ ఏపీఓ ఆత్రం భాస్కర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు చదువు అనేది నేటి సమాజంలో చాలా అవసరమని అన్నారు. ప్రతి విద్యార్థిని తల్లితండ్రులు తప్పక పాఠశాలకు పంపించాలని అన్నారు. నూతనంగా ఏర్పడిన కోసుపటేల్‌గూడ గ్రామంలో పాఠశాలను ఏర్పాటు చేయాలని ఇటీవల పీఓను కలిసి విన్నవించిన, గ్రామస్తుల కోరిక మేరకు ఒక సీఆర్టిని నియమించి పాఠశాలను ప్రారంభించడం జరిగిందని అన్నారు. పాఠశాలను ప్రారంభించడం పట్ల గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ జాదవ్ అనిత రోహిదాస్, గ్రామపటేల్ రావుజి, తుడం దెబ్బ మండల అధ్యక్షుడు యాదవ్‌రావ్, జంగు బాపు, జనార్ధన్, కోసేరావ్, లక్ష్మణ్ పాల్గొన్నారు.

మజీద్ నిర్మాణానికి నిధులు మంజూరు



నవతెలంగాణ-ఆదిలాబాద్ రూరల్

మండలంలోని లోకారి, అంకొలి గ్రామాల్లోని మజీద్‌ల నిర్మాణానికి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం వక్ఫ్ బోర్డ్ నిధుల ద్వారా రూ.15లక్షల చొప్పున రెండు గ్రామాలకు రూ.30లక్షలు మంజూరు చేయటం జరిగిందని ఎంపీపీ గండ్రత్ రమేష్ తెలిపారు. ఈ పనులను ఎంపీపీ గండ్రత్ రమేష్ భూమిపూజ చేసి ప్రారంభించారు. అన్ని వర్గాల అభివృద్ధికి తెలంగాణ ప్రభుత్వం కృషి చేస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో అంకోలి, లోకారి గ్రామసర్పంచ్‌లు భూమన్న, కల్పన లక్ష్మణ్, ఎంపీటీసీలు మాడ సూరక్క, మడవి నాగుబాయి, కిషన్, డీసీసీబీ డైరక్టర్ పరమేశ్వర్, మార్కెట్ కమిటీ చైర్మెన్ విజయలక్ష్మీ రాజు, బీఆర్ఎస్ నాయకులు ప్రహ్లాద్, సెవ్వ జగదీష్, రమణ, గంగయ్య బుచ్చన్న, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఆశ్రమ పాఠశాలలో వైద్య శిబిరం

నవతెలంగాణ-బజార్‌హత్నూర్



మండల కేంద్రంలోని గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలుర పాఠశాలలో స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ భీంరావ్ ఆధ్వర్యంలో సోమవారం వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ భీమ్‌రావు మాట్లాడుతూ విద్యార్థులు వ్యక్తిగత శుభ్రతతో పాటు తడి బట్టలు ధరించకుండా జాగ్రత్తలు పాటించాలని అన్నారు. వర్షాకాలం దగ్గు, జలుబు, జ్వరం లక్షణాలు కనిపించినట్లయితే వెంటనే స్థానిక ఆస్పత్రికి వచ్చి చికిత్స చేయించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు ప్రకాష్, వార్డెన్ కృష్ణారావు, హెల్త్ సూపర్‌వైజర్ దేవిదాస్, హెల్త్ అసిస్టెంట్ రమేష్, ఏఎన్ఎంలు జమున, ఆరాధన పాల్గొన్నారు.

కలెక్టరేట్ ఎదుట కార్మికుల వంటావార్పు



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

గ్రామపంచాయతీ కార్మికులు, సిబ్బందిని పర్మినెంట్ చేయాలని, వేతనాలకు ప్రత్యేక బడ్జెట్ కేటాయించి, ట్రెజరీ ద్వారా ఇవ్వాలని కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ ఎదుట ధర్నాకు దిగారు. ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ వంటావార్పు చేపట్టి రోడ్డుపై సహపంక్తి భోజనాలు చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు బొజ్జ ఆశన్న మాట్లాడుతూ సఫాయి కార్మికుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే వచ్చే ఎన్నికల్లో తగిన బుద్ధిచెబుతామని హెచ్చరించారు. పీఆర్సీ ప్రకారం వేతనం రూ.19 వేలు కార్మికులకు చెల్లించాలని అన్నారు. కారోబారి, బిల్ కలెక్టర్లను సహాయ కార్యదర్శులుగా నియమించాలని డిమాండ్ చేశారు. జీఓ నెంబర్ 51ను సవరించి మల్టీపర్పస్ వర్కర్ విధానాన్ని రద్దు చేయాలన్నారు. పాత కేటగిరిలన్నింటినీ యథావిధిగా కొనసాగించాలన్నారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని పేర్కొన్నారు. సిబ్బందికి అన్ని కార్మిక చట్టాలు పకడ్బందీగా అమలు చేయాలని అన్నారు. పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం, ప్రమాదబీమా, గ్రాట్యూటీ కల్పించాలని అన్నారు. ఈ డిమాండ్లన్నింటినీ పరిష్కరించాలని కార్మికులు సమ్మె చేపడుతున్నా సీఎం కేసీఆర్, రాష్ట్ర ప్రభుత్వం చిన్నచూపు చూడటాన్ని తీవ్రంగా ఖండించారు. కార్యక్రమంలో సంఘం నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

గ్రామస్తులంతా ఏకమై రోడ్డు బాగుచేసుకున్నారు..

నవతెలంగాణ-ఇచ్చోడ

మండలంలోని బాబ్జిపేట్ గ్రామానికి వెళ్లే మట్టి రోడ్డు ఇటీవల కురిసిన భారీ వర్షాలతో కోతకు గురైంది. దీంతో గ్రామానికి రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. కనీసం ద్విచక్ర వాహనం కూడ వెళ్లలేని పరిస్థితి నెలకొంది. బాబ్జిపేట్ గ్రామపంచాయతీ ప్రజలు అంత ఏకమై కలిసి కట్టుగా గడ్డ పరా, గుల్ల పట్టి కాల్వల వద్ద కొట్టుపోయిన పైపులను సరిచేసి, అవసరం ఉన్న చోట మొరం పోసి బాగు చేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ ప్రజాప్రతినిధులు, అధికారులు మారిన ఆనాడు కాలంలో ఏవిధంగా ఉందో అదే తరహాలో మా తాతలు, తండ్రులు, మా పిల్లలు కూడ రహదారి లేక అదే నరకం అనుభవిస్తున్న దుస్థితి బాబ్జిపేట్ ప్రజలు ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు గ్రామస్తుల పడుతున్న కష్టాలు గమనించి, రోడ్డు వేయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ నాయకులు దేవురావు, మోహన్, రమేష్, తులసిరామ్, గంగారాం, భీముడు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.



ప్రజల భద్రతకే కార్డెన్ సెర్చ్



నవతెలంగాణ-దిలావర్‌పూర్

ప్రజల భద్రతకే కార్డెన్ సెర్చ్ నిర్వహిస్తున్నామని, నిర్మల్ రూరల్ సీఐ బి.శ్రీనివాస్ అన్నారు. సోమవారం మండలంలోని న్యూలోలం గ్రామంలో ఉదయం కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. ఇందులో భాగంగా నెంబరు ప్లేట్లు లేని 6 వాహనాలు, ధృవపత్రాలు లేని 18 వాహనాలు, ఒక ఆటోను సీజ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సైబర్ నేరాలు చాలా పెరిగిపోతున్నందున ప్రజలు సైబర్ నేరగాళ్ల బరిలో పడకుండా అప్రమత్తంగా ఉండాలని అన్నారు. మీకేమైనా అపాయం జరుగుతుందని భావిస్తే వెంటనే 100 నెంబరుకు ఫోన్ చేసి సమాచారం అందించాలని తెలిపారు. అందరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని అన్నారు. మైనర్ యువకులకు వాహనాలు నడుపుటకు ఇవ్వరాదని అన్నారు. గ్రామంలో ప్రత్యేకంగా కూడల్లలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవడం వల్ల నేర నియంత్రణ చేయవచ్చని తెలిపారు. యువకులు మట్కా, గుట్కా, గంజాయి వంటి వ్యసనాలకు దురలవాట్లతో వారి జీవితాలను దుర్భరం చేసుకోవద్దని సూచించారు. బీటీ రోడ్డుపై కేజీవీల్ ట్రాక్టర్లు నడపరాదని హెచ్చరించారు. కార్యక్రమంలో దిలావర్‌పూర్ ఎస్సై గంగాధర్, నర్సాపూర్ ఎస్సై రవీంధర్, నిర్మల్ రూరల్ ఎస్సై అశోక్, ఏఆర్ స్పెషల్ పోలీసులు, నిర్మల్ రూరల్ పోలీసులు మొత్తం 40 మంది పోలీసులు పాల్గొన్నారు.

కార్మిక గర్జనకు తరలిరావాలి

నవతెలంగాణ-లక్ష్మణచాంద

తెలంగాణ ప్రగతిశీల బీడీ వర్కర్స్ యూనియన్ (ఐఎఫ్‌టీయూ) ఆధ్వర్యంలో కార్మిక హక్కుల సాధన కోసమై ఆగస్టు 4న హైదరాబాద్‌లో జరిగే కార్మిక గర్జనను విజయవంతం చేయాలని ప్రగతిశీల బీడీ వర్కర్స్ యూనియన్ జిల్లా సహాయ కార్యదర్శి ఎస్.గంగన్న అన్నారు. సోమవారం మండలంలోని వడ్యాల దేశాయ్ బీడీ హెడ్ ఆఫీస్‌లో కార్మికులతో సమావేశం నిర్వహించారు. అనంతరం కార్మిక గర్జన కర పత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ప్రగతిశీల బీడీ వర్కర్స్ యూనియన్ జిల్లా సహాయ కార్యదర్శి మాట్లాడుతూ ప్రావిడెంట్ ఫండ్ పెన్షన్ తక్కువగా వస్తుందని, అది జీవించటానికి సరిపోదని ప్రావిడెంట్ ఫండ్ పెన్షన్ పెంచాలని అన్నారు. దేశవ్యాప్తంగా కార్మికులు కోరిన సీబీటీ సిఫారసు చేసిన కేంద్రం ప్రభుత్వం పట్టించుకోలేదని అన్నారు. కనుక ఈపీఎఫ్ పెన్షన్‌ను పదివేల రూపాయలకు పెంచి ఇవ్వాలని డిమాండ్ చేశారు. బీడీ పరిశ్రమలో పనిచేస్తున్న కార్మికులందరికీ జీవన భృతి ఇస్తానన్న కేసీఆర్ చాలామందికి ఇవ్వడం లేదన్నారు. వెంటనే పరిశ్రమలోని కార్మికులందరికీ నెలకు రూ.2016 జీవన భృతి ఇవ్వాలని డిమాండ్ చేశారు. బీడీ పరిశ్రమపై జీఎస్టీ 28శాతం విధించడం వలన బీడీ పరిశ్రమకు నష్టం వస్తుందని, జీఎస్టీని ఎత్తివేయాలని బీడీ పరిశ్రమలు కాపాడాలని డిమాండ్ చేశారు. డిమాండ్ల సాధన కోసం కార్మికులంతా హైదరాబాద్‌లో ఈనెల 4న జరిగే కార్మిక గర్జనలో పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రగతిశీల బీటీ వర్కర్స్ యూనియన్ నాయకులు కవిత, ముత్తవ్వ, ఆశక్క, లక్ష్మి కార్మికులు పాల్గొన్నారు.



ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించాలి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

అపరిష్కృతంగా ఉన్న ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యల సాధనకై తెలంగాణ ఉపాధ్యాయ సంఘం రాష్ట్రవ్యాప్తంగా ఉపాధ్యాయ ఉద్యమ జాగరణ పేరుతో ఇచ్చిన పిలుపుమేరకు సోమవారం ఆదిలాబాద్ ఆర్డీవోకు జిల్లా తపస్ కార్యవర్గం ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శిలు సునీల్ చవాన్, వలబోజు గోపికృష్ణ మాట్లాడుతూ పీఆర్సీ కమిటీని వేసి, మధ్యంతర భృతిని వెంటనే ప్రకటించాలని అన్నారు. పెండింగ్‌లో ఉన్న అన్ని డీఏలను వెంటనే విడుదల చేయాలని అన్నారు. సీపీఎస్ విధానాన్ని రద్దుచేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని అన్నారు. పండిత్, పీఈటీ పోస్టులను అప్‌గ్రేడ్ చేయాలన్నారు. కేజీబీవీ ఉపాధ్యాయులు, మోడల్ స్కూల్, గురుకుల పాఠశాలల, గిరిజన సంక్షేమ పాఠశాలల, అర్బన్ రెసిడెన్షియల్ పాఠశాలల సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరారు. ఆర్డీఓను కలిసిన వారిలో సంఘం జిల్లా నాయకులు మెట్పల్లి గోపాలకృష్ణ, సింగిడి వెంకటరమణారెడ్డి, జాదవ్ రాంజీ, తపస్ అదిలాబాద్ అర్బన్ మండల అధ్యక్షులు దత్తాత్రి ముండే, కేశవ్ పాల్గొన్నారు.

భరంపూర్ గ్రామానికి ప్రారంభమైన రాకపోకలు

నవతెలంగాణ-తలమడుగు

మండలంలో కురిసిన భారీ వర్షాలకు అనేక గ్రామాల్లో రోడ్లు కొట్టుకుపోయాయి. పంటపొలాలు నీటమునిగి రైతులకు తీవ్రనష్టాన్ని మిగిల్చాయి. మండలంలోని భరంపూర్ గ్రామానికి వెళ్లే ప్రధాన రహదారి వంతెన తెగిపోవడంతో ఆర్ అండ్ బి అధికారులు స్పందించి సోమవారం ఆ రోడ్డును పునరుద్ధరించారు. రోడ్డుకు అడ్డంగా 6 పెద్ద పైపులను బిగించి, వాగు నీరు పోయే విధంగా అమర్చి బస్సు, ఇతర వాహనాలు నడిచే విధంగా రోడ్డు పనులు చేపట్టారు. తాత్కాలికంగా రోడ్డు నిర్మించడంతో దాదాపు 23 గ్రామాలకు రాకపోకలు ప్రారంభమయ్యాయి. ఆర్ అండ్ బి అధికారులకు నాయకులకు పలు గ్రామాల ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు.



అన్ని వర్గాల అభ్యున్నతికి కృషి



నవతెలంగాణ-సారంగాపూర్

అన్ని వర్గాల అభ్యున్నతికి తెలంగాణ ప్రభుత్వం కృషి చేస్తుందని ఎఎంసీ చైర్‌పర్సన్ ఆశ్రిత శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని ప్యారమూర్ గ్రామానికి చెందిన యాదవ, కుర్మలకు రెండో విడుత మంజూరైన 13 గొర్రెల యూనిట్లను సర్పంచ్ దివ్యారెడ్డి లింగారెడ్డితో కలిసి లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సహన్ని అందిపుచ్చుకొని ఆర్థికంగా అభివృద్ధి చెందాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పశువైద్యులు జమిల్ హైమద్, నాయకులు లింగారెడ్డి, గ్రామ ఉపసర్పంచ్ మోహన్‌రెడ్డి, ఎఎంసీ డైరెక్టర్ సాయన్న, యాదవ, కుర్మ సంఘం సభ్యులు పాల్గొన్నారు.

వర్షం నీరు ఒడిసి పట్టాలి.. వృథా అరికట్టాలి..



నవతెలంగాణ-లక్ష్మణచాంద

మండలకేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో సోమవారం వర్షం బొట్టు ఒడిసి పట్టు కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఐకేపీ కార్యాలయంలో రైన్ వాటర్ రూఫ్ టాప్ హార్వెస్టింగ్ స్ట్రక్చర్స్ నిర్మాణం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ ప్రతీ ఒక్కరూ వర్షం నీటిని వృథా అవ్వకుండా తగు నిర్మాణాలు చేపట్టి ఒడిసి పట్టాలని సూచించారు. మండలంలోని అన్ని గ్రామాల్లో రూఫ్ టాప్ హార్వెస్ట్ నిర్మాణాలు చేపట్టినట్లు ఎంపీడీఓ శేఖర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ ఆఫీసర్, ఎంపీడీఓ శేఖర్, ఎంపీఓ నసీరుద్దీన్, ఏపీఓ ప్రమీల, ఐకేపీ ఏపీఎం వాణిశ్రీ, సీడీపీఓ నాగమణి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ భాగ్యవతి, ఈజీఎస్ సిబ్బంది, ఐకేపీ సిబ్బంది పాల్గొన్నారు.

ఓటు హక్కు నమోదు చేసుకోవాలి

నవతెలంగాణ-లక్ష్మణచాంద

18 సంవత్సరాలు నిండిన యువత తమ ఓటు నమోదు చేసుకోవాలని జడ్పీటీసీ ఓస రాజేశ్వర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల ఆగష్టు 21 నుంచి సెప్టెంబర్ 19 వరకు నూతన ఓటరు నమోదు, మార్పులు చేర్పులు కొరకు అవకాశం ఇచ్చిందని తెలిపారు. ప్రతీ ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని, అక్టోబర్ 4న తుది జాబితా విడుదల చేయడం జరుగుతుందని పేర్కొన్నారు. ఓటు హక్కు ద్వారా మాత్రమే తమకు కావాల్సిన నాయకున్ని ఎంచుకోవడం సాధ్యమని పేర్కొన్నారు.

లంబాడాలపై బీజేపీ మొసలి కన్నీరు

నవతెలంగాణ-ఖానాపూర్

లంబాడాలపై బీజేపీ మొసలి కన్నీరు కారుస్తుందని లంబాడ హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షులు బానోవత్ గోవింద్ నాయక్ అన్నారు. సోమవారం స్థానికంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఆదివాసుల, లంబాడాల మధ్య చిచ్చుపెట్టి బీజేపీ అధికారంలోకి రావాలనుకోవడం మీ మూర్ఖత్వమేనని అన్నారు. గిరిజనులకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం 6 శాతం నుంచి 10 శాతం పెంచిన రిజర్వేషన్ బిల్లును కేంద్రం ఎందుకు అనుమతి ఇవ్వడం లేదనీ ప్రశ్నించారు. తెగల మధ్య చిచ్చు పెట్టి వారు కొట్లాటలో చనిపోయారని అన్నారు. బ్రతికిన వారికి రిజర్వేషన్ పెంచుతార అని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎంపీ సోయం బాపురావును బీజేపీ నుంచి బహిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో రాష్ట్ర నాయకులు జాదవ్ అశోక్ నాయక్ పాల్గొన్నారు.


'కార్మికుల పట్ల ప్రభుత్వ నిర్లక్ష్యం సరికాదు '

నవతెలంగాణ-కడెం

గ్రామపంచాయతీ కార్మికుల సమస్యల పట్ల ప్రభుత్వ నిర్లక్ష్యం సరికాదని పంచాయతీ కార్మిక సంఘం మండల అధ్యక్షులు మహేష్ అన్నారు. సోమవారం మధ్యాహ్నం మండల కేంద్రంలో మండల పంచాయతీ కార్మికులు చేపట్టిన నిరవధిక సమ్మె శిబిరం వద్ద వారు మాట్లాడారు పంచాయతీ కార్మికులు గత 26 రోజులుగా రాష్ట్రవ్యాప్తంగా సమ్మె చేస్తున్న ప్రభుత్వం నిమ్మకు నీరు ఎత్తనట్టుగా వ్యవహరించడం సరికాదని మండిపడ్డారు. చాలీచాలని వేతనాలతో పంచాయతీ కార్మికులు కుటుంబాలను పోషించడం కష్టంగా మారిందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి పంచాయతీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల పంచాయతీ కార్మిక సంఘం నాయకులు కార్మికులు పాల్గొన్నారు.

పంటపొలాలను పరిశీలించిన బీజేపీ నాయకులు

నవతెలంగాణ-సారంగాపూర్



మండలంలోని చించోలి గ్రామంలో ఇటీవల కురిసిన భారీ వర్షాలకు దెబ్బతిన్న పంటలను, రోడ్లను సోమవారం హుజూరాబాద్ ఎమ్మెల్యే ఈటెల రాజేందర్, మాజీ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి పరిశీలించారు. పంట నష్టపోయిన రైతుల గోడును విన్నారు. అనంతరం వారు మాట్లాడారు వరదలకు పంట నష్టపోయిన రైతులకు పరిహారం అందించి ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

ప్రతి ఇంటా ఇంకుడు గుంతలు నిర్మించుకోవాలి

నవతెలంగాణ-సారంగాపూర్

భూగర్భ జలాలను పెంచేందుకు ప్రతి ఇంటి ఆవరణలో ఇంకుడు గుంతలు నిర్మించుకోవాలని ఎంపీపీ మహిపాల్‌రెడ్డి, జెడ్పీటీసీ రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. మండలకేంద్రంలో సోమవారం ఉదయం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద, ప్రజా పరిషత్ కార్యాలయం ఆవరణలో ఇంకుడు గుంతను తవ్వించారు. ప్రతి ఇంటి ఆవరణలో ఇంకుడు గుంతలు ఏర్పాటు చేయడం ద్వారా దానిలో వర్షపు నీరు ఇంకి భూగర్భ జలాలు పెరుగుతాయని అన్నారు. కార్యక్రమంలో ఏపీడీ ప్రసాద్, ఎంపీడీఓ సరోజ, తహసీల్దార్ సంతోష్‌రెడ్డి, ఎంపీఓ తిరుపతిరెడ్డి, గ్రామసర్పంచ్ సుజాత నర్సారెడ్డి, ఎంపీటీసీ పద్మ వీరయ్య, డా.వేదవ్యాస్, హెల్త్ సూపర్‌వైజర్ ఎంకె గౌడ్, ఎపీఓ లక్ష్మారెడ్డి, ఏపీఎం మాధురి, పంచాయతీ కార్యదర్శి గోపికృష్ణ, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ విజయగౌరీ, సీసీ భుమేష్, టీఏ సునీల్, ఎఫ్ఏ శ్రీనివాస్ ఉపాధి హామీ సిబ్బంది ఉన్నారు.

www.navatelangana.com
నవతెలంగాణ
మంచిర్యాల
కుమురం భీం-ఆసిఫాబాద్
మంగళవారం 01 ఆగస్టు 2023

లంబాడితండా(కె)లో ఖాళీ బిందెలతో నిరసన



కాసిపేట : మండలంలోని లంబాడితండా(కె) గ్రామ పంచాయతీలో గత పది రోజుల నుండి నీళ్లు రావడం లేదని గ్రామస్థులు సోమవారం కాళీ బిందెలతో రోడ్డుపై నిరసన తెలిపారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ మిషన్ భగీరథ రావట్లేదని అలాగే ఎన్నో నెలలుగా పాడైపోయి ఉన్న బోర్లు రిపేర్ చేయించట్లేదని, అంతేకాకుండా నాలుగు నెలల క్రితం వేసిన బోరుకు ఇప్పటికీ కనెక్షన్ కూడా ఇవ్వట్లేదన్నారు. దింతో గ్రామంలో తీవ్ర నీటి కొరత ఏర్పడిందని, కనీసం ప్రజా ప్రతినిధులు గ్రామ పంచాయతీ ట్యాంకర్ ద్వారా అయినా నీటి సరఫరా చేయట్లేదని తెలిపారు. ఇప్పటికైన అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి సమస్యని పరిష్కరించకపోతే తీవ్ర స్థాయిలో ఆందోళనలు చేపడతామని తెలిపారు.

దెబ్బతిన్న పంటల పరిశీలన

నవతెలంగాణ-కోటపల్లి

ఇటీవల కురిసిన భారీ వర్షాలకు దెబ్బతిన్న పంటలను సోమవారం మండల వ్యవసాయ అధికారి మహేందర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో 17 గ్రామాలలో దాదాపు 3465 ఏకరాలలో పంట నష్టం జరిగిందని తెలిపారు. ఈ నివేదికను ప్రభుత్వానికి పంపినట్లు తెలిపారు. అకాల వర్షాల వలన దెబ్బ తిన్న చేన్లలో మొక్కల ఎదగడానికి 13-0-47 మల్టీ కే ఎకరాకు కిలో చొప్పున పిచికారి చేసి మొక్క మొదట్లో 20 కిలోల యూరియా 5 కిలోల పోటాష్ వేసి అంతర కృషి చేసుకోవాలని, కలుపు ఎక్కువగా ఉన్న చేన్లలో పారక్వాట్ డై క్లోరైడ్ లేదా ఇతర కలుపు మందులు నాజల్ అడ్జస్ట్ చేసి మొక్కల మీద పడకుండా స్ప్రే చేసుకోవాలని రైతులకు సూచించారు. కార్యక్రమంలో ఏఈఓ శేఖర్, రైతులు పాల్గొన్నారు.

6న మహాసభను విజయవంతం చేయాలి



నవతెలంగాణ-సిర్పూర్(టి)

కాగజ్‌నగర్ పంట్టణంలో ఈ నెల 6న నిర్వహించే సీఐటీయూ జిల్లా ప్రథమ మహాసభలను విజయవంతం చేయాలని ఆ సంఘం జిల్లా నాయకుడు వెలిశాల కృష్ణమా చారి కోరారు. సోమవారం ఐసీడీఎస్ కార్యాలయం ఎదుట జిల్లా ప్రథమ మహాసభల పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాగజ్‌నగర్‌లోని సంతోష్ ఫంక్షన్‌హాలులో మహా సభలు నిర్వహించనుట్టు తెలిపారు. ఈ మహాసభకు ముఖ్య వక్తలుగా సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్, సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి డి మధు, సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు ఎస్ రమా హాజరవుతారని వివరించారు. మండలంలోని వివిధ కార్మిక సంఘాల కార్మికులు అధిక సంఖ్యలో హాజరై మహాసభను విజయవంతం చేయాలని అన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు మంగ, శ్రీలత, మధుర, రాజేశ్వరి, శివాని పాల్గొన్నారు.

విద్యార్థులకు షీ టీం అవగాహన

నవతెలంగాణ-వాంకిడి

మండలకేంద్రంలోని స్థానిక జిల్లా పరిషత్ పాఠశాలలో సోమవారం షీ టీం ఇన్‌ఛార్జి సునీత ఆధ్వర్యంలో షీ టీం విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులకు హింస, సైబర్ క్రైంకు ఎవరైన గురైనట్టయితే షీం టీంను స్పందించాలని షీటీం ఇన్‌ఛార్జి సునీత విద్యార్థులకు సూచించారు. సైబర్ క్రైంకు గురైతే 1930కు కాల్ చేయాలని, అప్రమత్తంగా ఉండాలని, అపరిచిత వ్యక్తులకు ఫోన్ నెంబర్లు ఇవ్వకూడదని సూచించారు. ఏదైనా అత్యవసర సమయంలో 100కు డయల్ చేయాలని లేదా షీ టీం ఆసిఫాబాద్ 8712670564ను సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, షీ టీం సభ్యులు శ్రీలత, స్వప్న పాల్గొన్నారు.

డబుల్ ఇంజన్ సర్కార్ తోనే అభివృద్ధి

నవతెలంగాణ-చింతలమానేపల్లి

కేంద్రంలో ఉన్న డబుల్ ఇంజన్ సర్కారుతోనే దేశం అభివృద్ధి చెందుతుందని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు డా.పాల్వాయి హరీష్ బాబు అన్నారు. సోమవారం మండలంలోని గూడెం వద్ద ఉధతంగా ప్రవహిస్తున్న ప్రాణహిత నదీ ప్రవాహాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిర్పూర్ నియోజకవర్గానికి అన్ని వైపులా బ్రహ్మాండమైన నీటి వనరులున్నా, మన సాగు భూములు ఏడారిగా మారాల్సిన పరిస్థితి ఎందుకు దాపురించిందో ఆలోచించాలని అన్నారు. గత 9 సంవత్సరాల కేసీఆర్ పాలనలో సిర్పూర్ నియోజకవర్గంలో 9 ఎకరాల సాగు భూమికి కూడా నీరు అందించలేదని విమర్శించారు. ఒకవైపు వార్ధా నది, ఇంకోవైపు ప్రాణహిత నది, మరోవైపు ఎర్రవాగు, పెద్దవాగు లాంటి నీటి వనరులున్నా ఈ నీటిని సాగు భూములకు మళ్లించడంలో సిర్పూర్ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప విఫలమయ్యారని దుయ్యబట్టారు. భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో త్వరలో ఏర్పడే డబుల్ ఇంజన్ సర్కార్ ఈ సాగు నీటిని మళ్లించి సిర్పూర్ నియోజకవర్గ రైతాంగానికి అండగా నిలుస్తామని తెలిపరు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ ఎల్కులే మల్లయ్య, సర్పంచ్ చౌదరి నానయ్య, మాజీ సర్పంచ్ పేదం సుధాకర్, నాయకులు పురుషోత్తం చారి, దోంగ్రే నానాజీ, చాప్లె సత్తయ్య, శ్రీమన్నారాయణ, కుకడకర్ రమేష్ పాల్గొన్నారు.

5 వరకు ఇంటర్ అడ్మిషన్ల గడువు పొడిగింపు

నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రభుత్వ రంగ, ప్రయివేట్ జూనియర్ కళాశాలల్లో ఇంటర్ మొదటి సంవత్సరం విద్యార్థులు చేరటానికి అడ్మిషన్ల గడువును ఆగస్టు 5వ తేదీ వరకు పెంచినట్లు జిల్లా మాధ్యమిక విద్యాధికారి డా.శ్రీధర్ సుమన్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్రంలోని జూనియర్ కళాశాలలో విద్యార్థులు మొదటి సంవత్సరం అడ్మిషన్ చేరటానికి జూలై 31 వరకు మాత్రమే గడువు ఉందని వరుసగా కురిసిన భారీ వర్షాల కారణంగా విద్యార్థుల సౌలభ్యం కొరకు ఈ గడువును ఆగస్టు 5వ తేదీ వరకు పొడిగించినట్లు, ప్రయివేటు జూనియర్ కళాశాలలో అడ్మిషన్ పొందగోరే విద్యార్థులు గడువు తేదీ ముగిసిన తర్వాత ఆగస్టు 6 నుండి 16వ తేదీల్లో రు.500 ఆలస్య రుసుము చెల్లించాల్సి ఉంటుందని, ఇంటర్ మొదటి సంవత్సరం అడ్మిషన్ల ప్రక్రియ గడువు తేదీ ఆగస్టు 5 లోగా పూర్తి చేసుకోవాల్సిందిగా సూచించారు.

గౌడ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శిగా భాస్కర్‌గౌడ్

తాండూర్ : మంచిర్యాల పట్టణంలో ఆదివారం నిర్వహించిన మోకు దెబ్బ గౌడ సంఘం మహాసభల్లో మంచిర్యాల జిల్లా ప్రధాన కార్యదర్శిగా తాండూర్ మండలం బోయపల్లి బోర్డు గ్రామానికి చెందిన పెరుమాండ్ల భాస్కర్‌గౌడ్‌ను ఎన్నుకున్నారు. సంఘం అధ్యక్షులు తెలంగాణ చైర్మన్ అమరవేణి నర్సగౌడ్‌తో పాటు రాష్ట్ర జిల్లా గౌడ కులస్తులకు ధన్యవాదాలు తెలిపారు. సంఘ నాయకులకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ గౌడ హక్కుల సాధనకై తన వంతు కృషి చేస్తానని భాస్కర్‌గౌడ్ అన్నారు.

విశ్రాంత ఉద్యోగులకు ధ్రువపత్రాలు అందజేయాలి

రెబ్బెన : ప్రతి విశ్రాంత సింగరేణి ఉద్యోగి బ్యాంకు ఖాతాలో ఫార్మర్ లేదా సర్వేయర్ మోడ్‌లోకి మార్చుకోవాలని బెల్లంపల్లి ఏరియా పర్సనల్ మేనేజర్ ఐ లక్ష్మణ్‌రావు తెలిపారు. పెన్షన్ పొందుతున్న ఉద్యోగి మృతిచెందిన అనంతరం నామినికి పెన్షన్ అందించే క్రమంలో సమస్యలు తలెత్తుతున్నాయన్నారు. సీఎంపీఎఫ్ రీజినల్ కమీషనర్ జీడీకె ఆదేశాల మేరకు రిటైర్ అయిన ప్రతి ఉద్యోగి గమనించాలన్నారు. ఉద్యోగి, అతని భార్య ఆధార్‌కార్డు, పెన్షన్ పొందుతున్న బ్యాంకు ఖాతాను ఫార్మర్ లేదా సర్వేవర్ మోడ్‌లోకి మార్చిన జిరాక్స్, సీపీఆర్ఎంహెచ్ కార్డు జిరాక్స్, మూడు ఫోటోలను సంబంధిత మెయిన్ డిపార్టుమెంట్లలో అందజేయాలని ఆయన కోరారు.

వికలాంగ బాలుడికి వీల్ చైర్ అందజేత

రామకృష్ణాపూర్ : పట్టణంలోని స్థానిక ఇందిరానగర్ కాలనికి చెందిన బాల వికలాంగుడు అయిన రంగు అనిరోధ్‌కు సోమవారం కాంగ్రెస్ నాయకులు డాక్టర్ రాజా రమేష్ వీల్ చైర్ అందించారు. తమ కుమారునికి సహాయం అందిచిన డాక్టర్ రాజా రమేష్‌కు ఆ బాలుని తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మందమర్రి మండలం బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు గోపతి రాజయ్య, మండల అధ్యక్షులు జీవన్ కుమార్ పాల్గొన్నారు.

శాంతి భద్రతల పరిరక్షణకు పోలీసులు కృషి చేయాలి



నవతెలంగాణ-తాండూర్

శాంతి భద్రతల పరిరక్షణకు పోలీసులు కృషి చేస్తున్నట్టు బెల్లంపల్లి ఏసీపీ సదయ్య తెలిపారు. సోమవారం కన్నెపల్లి పోలీస్‌స్టేషన్‌ను తనిఖీ చేసి అధికారులతో కలిసి పోలీస్ స్టేషన్ పరిసరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాంతి భద్రతల పరిరక్షణ కోసం పోలీసు సిబ్బంది బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని తెలిపారు. ఫిర్యాదుదారులతో మర్యాదగా ప్రవరిస్తూ సమస్యలను జాప్యం చేయకుండా పరిష్కరించాలన్నారు. రాబోయే ఎన్నికలు ప్రశాంతమైన వాతావరణంలో జరిగే విధంగా ముందస్తు చర్యలు చేపట్టాలని పోలీస్‌స్టేషన్ పరిధిలోని ప్రతి గ్రామాన్ని సందర్శించాలని అన్నారు. గ్రామాల ప్రజలతో సత్సంబంధాలు కలిగి ఉండి ఇన్ఫర్మేషన్ వ్యవస్థను, వీపీఓ సిస్టమ్‌ను పటిష్టం చేసుకోవాలని సూచించారు. సమస్యాత్మక గ్రామాలను, పోలింగ్ స్టేషన్ లను గుర్తించాలన్నారు. ఎన్నికలకు భంగం కలిగించే వారిని బైండోవర్ చేయాలని, పాత నెరగాళ్లపై నిఘా ఉంచాలని ఆదేశించారు. పోలీస్‌స్టేషన్ పరిధిలో బీట్లు, పెట్రోలింగ్ పకడ్బందీగా నిర్వహిస్తూ నేరాలను నియంత్రించాలన్నారు. వాహన తనిఖీలు చేస్తూ, రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు చెప్పటాలని, డ్రంక్ అండ్ డ్రైవ్, ర్యాష్ డ్రైవింగ్ చేసే వారి పట్ల కఠినంగా వ్యవరించాలని సూచించారు. రోడ్డు భద్రత నియమలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. గ్రామాలలో సీసీ కెమెరాల ఏర్పాటు ప్రాముఖ్యతను ప్రజలకు వివరించాలని తెలిపారు. సైబర్ నేరాల పట్ల ప్రజల్లో అవగాహన కల్పించాలని సూచించారు. మహిళలపై అఘాత్యాలు చేసే వారు ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదన్నారు. పోలీసులంటే ప్రజల్లో గౌరవం పెరిగేలా పోలీసు సిబ్బంది ప్రవర్తించాలని కోరారు. ఏసీపీ వెంట తాండూర్ సీఐ శ్రీనివాస్‌రావు, ఎస్సై నరేష్ ఉన్నారు.

పిల్లలు అన్యోన్యంగా కలిసి ఉండాలి

గురుకుల పాఠశాలల్లో చదువుకునే పిల్లలందరు అన్యోన్యంగా కలిసి ఉండాలని బెల్లంపెల్లి ఏసీపీ పంతాటి సదయ్య అన్నారు. సోమవారం తెలంగాణ సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల సెంటర్ ఆఫ్ ఎక్సలెన్సీ బెల్లంపల్లిలో జరిగిన ఫ్రెషర్స్ డేలో ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. ముందుగా బెల్లంపల్లి మున్సిపల్ కమిషనర్ కె.సమ్మయ్, ఎంఈఓ పి.మహేశ్వర్‌రెడ్డిలతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి మహనీయుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అంతరం కార్యక్రమంలో విద్యార్థులను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ విద్యార్థులు బెల్లంపల్లి కీర్తిని దేశం నలుమూలల చాటేలా చక్కగా చదువుకోవాలని సూచించారు. చెడు వ్యసనాలకు బానిస కాకుండా ఉన్న ప్రాంతానికి, కనిపించిన తల్లిదండ్రులకు చెడ్డ పేరు తీసుకు రాకుండా ఉన్నతంగా ఎదగాలన్నారు. గురుకులాల కీర్తి ప్రతిష్టలను పెంచేలా సిఓఈలో ఉపాధ్యాయులుకృషి చేయడం అభినందనీయమన్నారు. విశిష్ట అతిథిగా పాల్గొన్న బెల్లంపల్లి మున్సిపల్ కమిషనర్ కే సమ్మయ్య మాట్లాడుతూ తల్లిదండ్రులకు గొప్ప పేరు తీసుకొచ్చేలా విద్యార్థులు ఎదగాలని సూచించారు. అనంతరం విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో పేరెంట్స్ కమిటి గౌరవాధ్యక్షుడు దాగం తిరుపతి, అధ్యక్షుడు పూదరి నగేష్‌గౌడ్, వైస్ ప్రిన్సిపాల్ కె.రాజ్ కుమార్, జేపీపీ కొక్కుల రాజేశ్వర్, అధ్యాపకులు చందా లక్ష్మీనారాయణ, నాగిని శ్రీరామవర్మ, మిట్ట రమేష్, సుంకరి అర్జున్, అవునూరి రవి, ఉపాధ్యాయులు వరమని ప్రమోద్ కుమార్, షిండే దత్తప్రసాద్, ఎండి కౌసర్, పొన్నం శ్రీనివాస్, దుర్గం రమాదేవి, దాసం అజిత, యాస్మాని హరిక, సింగారావు స్రవంతి, నడిగోటి రాకేష్, సిబ్బంది గోదారి రాజశేఖర్, రాగడి సమంధర్ పాల్గొన్నారు.



నర్సరీ కార్మికులకు భద్రత కల్పించాలి

- ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బోగే ఉపేందర్



నవతెలంగాణ-ఆసిఫాబాద్

రాష్ట్రంలోని అటవీ నర్సరీలో పనిచేస్తున్న కార్మికులను రాష్ట్ర ప్రభుత్వం శ్రమ దోపిడికి గురిచేస్తోందని వారికి భద్రత కల్పించాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బోగే ఉపేందర్ అన్నారు. సోమవారం కలెక్టరేట్ కార్యాలయం ఎదుట కార్మికులతో కలిసి నిరసన తెలిపి అనంతరం డీఆర్ఓ రాజేశ్వర్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో సుమారుగా 10,000 మంది నర్సరీ కార్మికులు నర్సరీల్లో పని చేస్తున్నారన్నారు. కనీస వేతనాలు లేకపోవడంతో శ్రమ దోపిడి గురవుతున్నారన్నారు. కార్మికులందరూ చాలీచాలని వేతనాలు తీసుకుంటూ కుటుంబపోషణ భారంగా మారిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన హరితహారం కార్యక్రమంలో వీరి పాత్ర వెలకట్టలేనిదని గుర్తు చేశారు. కార్మికులకు పెండింగ్‌లో ఉన్న ఐదు నెలల వేతనాలు వెంటనే చెల్లించాలని, ప్రతిరోజు కూలి రూ.600 ఇవ్వాలని, ఈఎస్ఐ, పీఎఫ్, బోనస్ సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం నర్సరీ కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని లేనిపక్షంలో ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర అటవీ నర్సరీ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు టి.దివాకర్, జిల్లా ప్రధాన కార్యదర్శి దుర్గం సంఘమిత్ర, జిల్లా ఉపాధ్యక్షులు అయిల్ల యశోద, రాజేష్, సహాయ కార్యదర్శి సుజాత, కమిటీ సభ్యులు కౌసల్య, మాయ, సరిత, భాగ్య పాల్గొన్నారు.

బీఆర్ఎస్ ప్రభుత్వానికి పిండ ప్రదానం

నవతెలంగాణ-కోటపల్లి

మండలంలోని రాంపూర్ గ్రామంలో చెన్నూర్ కాంగ్రెస్ టీపీసీసీ వైస్ చైర్మన్ దాసారపు శ్రీనివాస్ బీఆర్ఎస్ ప్రభుత్వానికి సోమవారం పిండ ప్రధానము చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనాలోచిత విధానాల వల్ల కట్టిన కాలేశ్వరం ప్రాజెక్టు ప్రతి సంవత్సరం పంటలు మునిగి పోతున్నాయని అన్నారు. పంట నష్టాన్ని ప్రభుత్వం పట్టించుకోకుండా రైతులను మోసం చేస్తుందని అన్నారు. ప్రతి సంవత్సరం పంట నష్టం తీవ్ర స్థాయిలో జరిగినా ఏ అధికారి, ఏ రాజకీయ నాయకుడు పట్టించుకున్న పాపాన పోలేదని అన్నారు. రానున్న కాలంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వెంటనే రైతు రాజ్యం తీసుకొస్తామని అన్నారు. అలాగే కౌలు రైతులను ఆదుకోకుండా నాటకాలు ఆడుతున్న ఎమ్మెల్యే బాల్క సుమన్‌కు పిండ ప్రధానం చేసినట్టు తెలిపారు. ప్రజలు ఎవరు బీఆర్ఎస్ ప్రభుత్వానికి ఓటు వేయడానికి సిద్ధంగా లేరని ఓటు అడగాలంటే నియోజకవర్గములో ఏమి అభివృద్ధి చేశాడో బాల్క సుమన్ చెప్పాలని అన్నారు. రైతులకు కాంగ్రెస్ ప్రభుత్వం ఎప్పుడు అండగా ఉంటుందని రైతులు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని అధికారంలోకి నిలబెట్టి రైతు రాజ్యం తేవాలని అన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు అసంపెల్లి నరేష్, మణి మహేష్, శ్రావణ్, రాజేష్, శ్రీను, రాకేష్, సుజిత్, ప్రవీణ్, వంశీ, సాయి పాల్గొన్నారు.



వరద బాధితులను ఆదుకోవడంలో ప్రభుత్వం విఫలం

సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా రాష్ట్ర నాయకులు నందిరామయ్య

నవతెలంగాణ-జన్నారం

వరదల్లో తీవ్రంగా నష్టపోయిన రైతులను, వరద బాధితకుటుంబాలను ఆదుకోవాలని సీపీఐ-(ఎంఎల్) ప్రజాపంత పార్టీ రాష్ట్ర నాయకులు నంది రామయ్య అన్నారు. సోమవారం మండల కేంద్రంలో లోని ప్రెస్ క్లబ్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో అతి వర్షాల వల్ల వేల కుటుంబాలు నష్టపోయారని అన్నారు. దాదాపు 2 లక్షల ఎకరాలలో పంట ధ్వంస మయ్యింది. వేల ఎకరాలలో ఇసుక మేట వేసి సేద్యం చేసుకొనే అవకాశం లేకుండా పోయిందన్నారు. రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు రెండూ ఈ విపత్తు సమయంలో బాధ్యత వహించాలని, యుద్ధ ప్రాతపదికన చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు భాదితులకు సహకారం అందించాలని డిమాండ్ చేశారు. తక్షణమే నెల రోజులలో ఆహార పదార్థాలను అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ ఎంఎల్ ప్రజాపంథా మంచిర్యాల జిల్లా కార్యదర్శి జాడి దేవరాజు, పురం శెట్టి బాపు ప్రజపంథా జన్నారం మండల నాయకులు, డి. మల్లేశ్ ఏపీకేఏస్ జన్నారం మండల అధ్యక్షులు , సట్ల సత్యన్న ఏపీకేఏస్ మండల ప్రధాన కార్యదర్శి, దుర్గం మున్నయ్య , దుర్గం రాజన్న తదితరులు పాల్గొన్నారు.



చట్టాలపై ప్రతి ఒక్కరికి అవగాహన ఉండాలి

నవతెలంగాణ-దండేపల్లి

ప్రతి ఒక్కరు చట్టాలపై అవగాహన పెంచుకోవాలని ముఖ్యంగా ఎస్సీ, ఎస్టీ సామాజిక వర్గానికి చెందినవారు తప్పనిసరిగా చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని మండల తహసీల్దార్ హనుమంతరావు అన్నారు. సోమవారం మండలంలోని లింగపూర్ గ్రామంలో ఏర్పాటు చేసిన సివిల్ రైట్స్ డే కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. చట్టాలపై అవగాహన కల్పించామని గ్రామ ప్రజలు పలు అంశాలను తమ దృష్టికి తీసుకురాగా పరిష్కరించామని అన్నారు. ఎవరైనా వివక్షకు గురి చేస్తే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. చట్టాలపై అవగాహన కలిగి ఉంటే సమస్యలను సత్వరమే పరిష్కారం చేసుకోవచ్చుని ప్రజలకు సూచించారు. అనంతరం లక్సెట్టిపేట సీఐ కృష్ణ సైబర్ నేరాలు, మహిళలపై జరుగుతున్న నేరాలు, వర్షాకాలంలో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి అవగాహన కల్పించారు. గ్రామంలోని దుబ్బగూడెంలో ఏర్పాటుచేసిన చర్చి వివాదంపై స్థానిక ప్రజలతో చర్చించారు. ప్రజలందరూ ఐకమత్యంతో ఉండాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ మల్లేశం, ఎస్సై ప్రసాద్ పాల్గొన్నారు.

పాఠశాలకు క్రీడా సామాగ్రి అందజేత

నవతెలంగాణ-దండేపల్లి

మంచిర్యాలకు చెందిన మార్వాడి యువ మంచ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో మండలంలోని ద్వారక ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు రూ.8 వేల విలువ గల క్రీడా సామాగ్రిని అందజేశారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు జయప్రద మాట్లాడుతూ స్వచ్ఛంద సంస్థ వారు విద్యార్థులకు క్రీడా సామాగ్రిని అందజేయడం అభినందనీయమని అన్నారు. గతంలో కూడా పలుమార్లు విద్యార్థులకు సేవా కార్యక్రమాలు చేశారని గుర్తు చేశారు. భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలు తమ పాఠశాలలో చేపట్టాలని వారిని కోరారు. అనంతరం స్వచ్ఛంద సంస్థ సభ్యులు మాట్లాడుతూ ప్రతి సంవత్సరం ప్రభుత్వ పాఠశాలలో పేద విద్యార్థులకు నోటు పుస్తకాల పంపిణీతో పాటు విద్యార్థులకు అవసరమైన క్రీడా సామాగ్రిని కూడా అందజేస్తున్నామని మరిన్ని సేవా కార్యక్రమాలతో ముందుకు వెళ్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో స్వచ్ఛంద సంస్థ సభ్యులు గోపాల్ వ్యాస్, నిలేస్ కాసావార్, పవన్ తివారి, రాజేష్ వ్యాస్, అమిత్, ఆదిత్య, కిషోర్, రాజా శాంతిలా, సూర్య ప్రకాష్, స్థానిక నాయకులు శంకర్‌రావు, కర్నాల రాజమౌళి పాల్గొన్నారు.

జిల్లాలో 30 పోలీస్ యాక్ట్ పొడిగింపు

నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లాలో శాంతి భద్రతల దష్ట్యా, జిల్లాలో ప్రశాంతతను నెలకొల్పేందుకు జిల్లా అంతటా ఆగస్టు 1 నుండి ఆగస్టు 31 వరకు పోలీస్ ఆక్ట్ 1861 అమల్లో ఉంటుందని జిల్లా ఎస్పీ సురేష్ కుమార్ సోమవారం ప్రకటనలో పేర్కొన్నారు. ఈ 30 పోలీస్ ఆక్ట్ 1861 అమలులో ఉన్నందున జిల్లాలో సబ్ డివిజనల్ పోలీస్ అధికారి లేదా పోలీస్ ఉన్నత అధికారుల నుంచి అనుమతి లేకుండా ఎటువంటి పబ్లిక్ మీటింగ్‌లు, ఊరేగింపులు, ధర్నాలు నిర్వహించరాదని సూచించారు. నిషేదిత ఆయుధములు అయిన కత్తులు, చాకులు, కర్రలు, జెండా కర్రలు, దుడ్డుకర్రలు, తుపాకులు, ప్రేలుడు పదార్థములు, నేరమునకు పురిగోల్పే ఎటువంటి ఆయుదాలను వాడరాదన్నారు. ప్రజలకు ఇబ్బంది, చిరాకు కలిగించేందుకు దారితీసే పబ్లిక్ మీటింగ్‌లను, జనసమూహం నిషేదం అన్నారు. లౌడ్ స్పీకర్‌లు, డీజేలు వంటివి కూడా ఈ సమయంలో నిషేధం అని తెలిపారు. జిల్లాలో 30 ఆక్ట్ అమల్లో ఉన్నందున నియమ నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ నిబంధనలు విధి నిర్వహణలో ఉన్న పోలీసులకు, మిలిటరీ అధికారులకు, విధినిర్వహణలో ఉన్న హోం గార్డ్స్, అంత్యక్రియ ఊరేగింపులకు వర్తించవని పేర్కొన్నారు.

అసాంఘిక శక్తులకు దూరంగా ఉండాలి

నవతెలంగాణ-కోటపల్లి

మండలంలోని కొండంపేట గ్రామంలో సోమవారం చెన్నూర్ రూరల్ సీఐ విద్యాసాగర్, కోటపల్లి ఎస్సై సురేష్ కమ్యూనిటీ కాంట్రాక్టు ప్రోగ్రాం నిర్వహించారు. స్పెషల్ పార్టీ, టీఎస్‌పీఎస్, స్థానిక పోలీస్ సిబ్బందితో కలిసి ఏరియా డామినేషన్, మావోయిస్టు ప్రభావిత గ్రామాలను సందర్శించి కల్వర్టులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సీఐ విద్య సాగర్, ఎస్సై సురేష్ గ్రామస్తులతో మాట్లాడి ప్రస్తుతం ఉన్న పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో ఎలాంటి సమస్య ఉన్న తమ దృష్టికి తీసుకురావాలని అన్నారు. మావోయిస్టులకు ఎవరు సహాయ పడవద్దని సహాయపడినట్లు తెలిస్తే చట్టపరంగా శిక్ష అనుభవిస్తారని అన్నారు. గ్రామాలలో ఎవరైనా అనుమానితులు కనిపిస్తే తమ దృష్టికి తీసుకురావాలని, పోలీసులు ఎల్లప్పుడూ ప్రజలకు అందుబాటులో ఉంటారని అన్నారు. గ్రామాలలో యువత చెడు అలవాట్లకు దూరంగా ఉంటు చదువు పైన శ్రద్ధ వహించాలని తల్లిదండ్రులకు గొప్ప పేరు తీసుకు వచ్చే విధంగా కష్టపడి ఉన్నత స్థాయిలో ఉండాలని అన్నారు. అనంతరం వాహనాలను తనిఖీ చేసి 23 ద్విచక్ర వాహనాలను 2 ఆటో లను సీజ్ చేశారు. ఈ కార్యక్రమంలో నీల్వాయి ఎస్సై సుబ్బారావు పాల్గొన్నారు.

జలపాతాలు, ప్రాజెక్టుల వద్ద పర్యాటకుల రాక నిషేధం

నవతెలంగాణ-వాంకిడి

గతకొన్ని రోజుల నుండి కురుస్తున్న భారీ వర్షాలకు ప్రాజెక్టులు, డ్యాంలు, వాటర్‌ఫాల్స్, చెరువులు, వాగులు నిండుగా ఉన్నాయని వాటిని తిలకించేందుకు పర్యాటకులను నివేధించినట్టు ఎస్సై సాగర్ సోమవారం ప్రకటనలో పేర్కొన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మండలంలోని పెర్తపెల్లి జలపాతం, అడా ప్రాజెక్టుకు ప్రజలు ఎవరు వెళ్లడానికి ఇవ్వదని ఆదేశాలు వచ్చినట్టు తెలిపారు. పర్యాటకులు పోలీసులకు సహకరించాలని కోరారు. ఎవరైన ఆపదలో ఉంటే వెంటనే క్రింది సీఐ 7812670509, ఎస్సై 8712670531 నెంబర్లకు ఫోన్ చేయాలని పేర్కొన్నారు.

ఉద్యోగ విరమణ పొందిన ఉద్యోగులకు సన్మానం

నవతెలంగాణ-కాసిపేట

కాసిపేట గనిలో అసిస్టెంట్ సూపరిండెంట్ ఖాజా నయిముద్దీన్, లైన్ మెన్ ఆగయ్యల ఉద్యోగ విరమణ సందర్భంగా వారిని సోమవారం కాసిపేట మేనేజర్ అల్లావుద్దీన్ సన్మానించారు. అలాగే గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాల నాయకులు చిప్ప నర్సయ్య, దాగం మల్లేష్, మీనుగు లక్ష్మీ నారాయణ, రాజేందర్, ఒడ్నాల రాజన్న, బైరి శంకర్, అబ్దుల్, శ్రీనివాస్, అశోక్, రమేష్, ఆఫీస్ సిబ్బంది బన్న లక్ష్మన్ దాస్, నాగేశ్వరరావు, రాజన్న, సదానందం, విక్రమ్, శ్రీకాంత్‌లు శాలువాతో సన్మానించారు. అనంతరం వారిని ఉద్దేశించి మేనేజర్ నిబద్ధత కల్గిన వ్యక్తి అని, సరైన పద్ధతులలో పనిచేయగలవారని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఓ సునీల్ కుమార్, ఇంజనీర్లు బాబు, మధుకర్, అండర్ మేనేజర్ నిఖిల్, వెంకటేష్, సిద్దార్థ, సర్వేయర్ వెంకకటేశ్వర్లు, సంక్షేమాధికారి మీర్జా గౌస్, జీషాలు పాల్గొన్నారు.

రోడ్డుపై మురుగునీటిని తొలగించాలి

నవతెలంగాణ-జన్నారం

మండలం పొంగల్ మేజర్ గ్రామపంచాయతీ పరిధిలోని ప్రధాన రహదారిపై ప్రవహిస్తున్న మురుగునీటిని శుభ్రం చేయించాలని కాంగ్రెస్ యువజన రాష్ట్ర నాయకుడు ఇమ్రాన్ అన్నారు. సోమవారం మురుగునీరు రోడ్డుపై పారుతున్న ప్రదేశాన్ని పరిశీలించారు. సందర్భంగా వారు మాట్లాడుతూ మురుగునీరు రోడ్డుపై చేరడం వల్ల ఈగలు దోమలు వాలి డెంగు, మలేరియా ప్రాణాంతకరమైన వ్యాధులు ప్రభలే అవకాశం ఉందన్నారు. వెంటనే పంచాయతీ అధికారులు స్పందించి ఈ మురుగునీటిని శుభ్రం చేయించాలని కోరుతున్నామన్నారు.

అధికారులకు పట్టింపు లేని ప్రజావాణి

నవతెలంగాణ-తాండూర్

ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణి ఫిర్యాదుల విభాగానికి అధికారులు తరచూ గైరాజరు అవుతున్నారు. ఎంపీడీఓ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమం వెలవెల పోయింది. కేవలం ఐదుగురు అధికారులతో ప్రజావాణి కార్యక్రమాన్ని కొనసాగించారు. కేవలం ఐసీడీఎస్, విద్యాశాఖ, ఐకేపీ, రెవిన్యూ శాఖలకు చెందిన వారు మాత్రమే హాజరయ్యారు. ఇరిగేషన్ ఇంజనీరింగ్, వెటర్నరీ, ఉపాధి హామీ, పంచాయితీ రాజ్, ఉద్యానవన, మిషన్ భగీరథ ఆరోగ్యశాఖకు చెందిన అధికారులు ఎవరూ హాజరు కాలేదు. మండల ప్రత్యేక అధికారి గజానంద్ అదనపు బాధ్యతల్లో ఉండటంతో ఎంపీడీఓ ప్రవీణ్ కుమార్ కేవలం నలుగురు అధికారులతో ప్రజావాణి కార్యక్రమం నిర్వహించారు.

5లోగా దరఖాస్తు చేసుకోవాలి

నవతెలంగాణ-జన్నారం

కొత్తగా పట్టా పాస్ బుక్ పొందిన రైతులు రైతు బీమా కోసం ఈ నెల 5లోగా దరఖాస్తు చేసుకోవాలని కవ్వాల్ క్లస్టర్ ఏఈఓ అక్రమ్‌ఖాన్ అన్నారు. సోమవారం కవ్వాల్ క్లస్టర్‌లోని దేవుని గూడా రైతు వేదికలో, కొత్త పాట పాసుబుక్ కలిగిన రైతులకు రైతు బీమా పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులు రైతు బీమా చేసుకోవడం వల్ల ప్రమాదవశాత్తు రైతులు మరణిస్తే వారి కుటుంబానికి రూ.5 లక్షల ప్రభుత్వం అందిస్తుందన్నారు. పట్టా పాస్ బుక్ కలిగి ఉండి, రైతు బీమా అప్లై చేసుకోకుంటే వారు ఈ పథకానికి అనార్హులన్నారు. మండలంలోని అన్ని గ్రామాల్లో ఉన్న రైతులు ఆయా రైతు వేదికలలో ఏఈఓల ద్వారా రైతు బీమా దరఖాస్తు చేయించుకోవాలని సూచించారు. దరఖాస్తు ఫారంతో, ఆధార్ కార్డు, నామినీ ఆధార్ కార్డు, పట్టా పాస్‌బుక్ జిరాక్స్ కాపీలను జతచేయాలన్నారు.

నేడు ఆదర్శ పాఠశాలలో స్పాట్ అడ్మిషన్లు

ఆసిఫాబాద్ : జిల్లా కేంద్రంలోని తెలంగాణ ఆదర్శ పాఠశాలలో 6వ తరగతిలో 5సీట్లకు, 7, 8, 9వ తరగతుల్లో ఒక్కోక్కటి చొప్పున ఖాళీ అయిన సీట్లకు మంగళవారం స్పాట్ అడ్మిషన్లు నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ అబ్దుల్ ఖలీల్ తెలిపారు. ఆసక్తి గల విద్యార్థులు మధ్యాహ్నం 3 గంటలకు పాఠశాలకు హాజరై బోనఫైడ్, ఆధార్ కార్డు జిరాక్స్ ప్రతులతో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఏప్రిల్‌లో నిర్వహించిన ప్రవేశ పరీక్షలో సాధించిన మార్కుల ఆధారంగా ఎంపిక ఉంటుందని, ఆసిఫాబాద్ మండల స్థానికులకు ప్రాధాన్యత ఉంటుందని తెలిపారు.

రక్షణతో కూడిన ఉత్పత్తి, ఉత్పాదకతను సాధించాలి

• జీఎం మోహన్ రెడ్డి

నవతెలంగాణ-మందమర్రి

మందమర్రి ఏరియా జనరల్ మేనేజర్ కార్యాలయంలో సేఫ్టీ రివ్యూ మీటింగ్ నిర్వహించారు. జీఎం కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్లో సోమవారం మందమర్రి ఏరియా జీఎం మోహన్‌రెడ్డి, ఏఎస్ఓ రవీందర్ అధ్యక్షతన గనుల డిపార్ట్మెంట్ల ఉన్నతాధికారులతో సేఫ్టీ రివ్యూ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎల్లప్పుడు రక్షణతో కూడిన ఉత్పత్తి, ఉత్పాదకతను సాధించాలని అధికారులకు సూచించారు. పని స్థలాలను నిశితంగా పరిశీలించిన అనంతరమే విధులు నిర్వహించడం మంచిదన్నారు. సూపర్వైజర్లు పని జరిగే స్థలాలను క్షుణ్ణంగా పరిశీలించాలన్నారు. కార్యక్రమంలో ఏరియాలోని అన్ని గనుల భద్రతా అధికారులు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ఎస్టీ సెల్ జిల్లా ఉపాధ్యక్షుని నియామకం

నవతెలంగాణ-జన్నారం

కాంగ్రెస్ జిల్లా ఎస్టీ సెల్ ఉపాధ్యక్షుడిగా జన్నారం మాజీ సర్పంచ్ నందునాయక్‌ని నియమిస్తూ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మాణిక్యం ఠాగూర్ సోమవారం హైదరాబాద్‌లో నియామక పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని పది అసెంబ్లీ స్థానాలను గెలిపించడానికి ప్రతి కార్యకర్తగా సమిష్టిగా కృషి చేయాలని సూచించారు. కేంద్రంలో బిజెపి రాష్ట్రంలో టిఆర్ఎస్ ప్రభుత్వాలు చేస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. కాంగ్రెస్ మేనిఫెస్టోను ప్రజలకు తెలిపి పార్టీని అన్ని గ్రామాల్లో పటిష్టం చేయాలని సూచించారు. నూతనంగా నియమింపబడ్డ ఎస్టీ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు నందునాయక్‌ను రాష్ట్ర ఎస్టీ సెల్ ఉపాధ్యక్షుడు భరత్ చౌహన్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు బెల్లయ్య నాయక్, పార్టీ మాజీ అధ్యక్షులు బోర్లకుంట ప్రభుదాస్, ప్రధాన కార్యదర్శి షసిఉల్ల, ప్రధాన కార్యదర్శి మోహన్‌రెడ్డి, ముత్యం రాజన్న అభినందించారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి

నవతెలంగాణ-జైపూర్



మండల కేంద్రంలో గల గ్యాస్ గోదాం సమీపంలో సోమవారం ఉదయం వ్యక్తి మృతదేహాన్ని గుర్తించినట్లు ఎస్సై ఉపేందర్‌రావు తెలిపారు. 65-70 మధ్య వయస్కుడైన మృతుడు లేత ఆకుపచ్చ రంగు గీతల షర్టు, తెలుపు రంగు లుంగీపై ఉన్నట్లు తెలిపారు. వ్యక్తిని గుర్తించి సమాచారం తెలిస్తే 8712656551, 9441122702 నెంబర్‌లో సంప్రదించాలని పేర్కొన్నారు.

రేపు జావలిన్ త్రో జిల్లా స్థాయి అథ్లెటిక్స్ సెలెక్షన్

నవతెలంగాణ-ఆసిఫాబాద్

రాష్ట్ర స్థాయి పోటీలను పురస్కరించుకొని రేపు జిల్లా కేంద్రంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల ఆవరణలో జిల్లా స్థాయి జావలిన్ త్రో ఎంపిక పోటీలు నిర్వహిస్తామని అథ్లెటిక్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు కోట్నాక విజయ్, ప్రధాన కార్యదర్శి సట్ల శంకర్ ఉమ్మడి ప్రకటనలో పేర్కొన్నారు. జావిలిన్ త్రోతో పాటు 100 మీటర్లు, 400 మీటర్ల అథ్లెటిక్స్ పోటీలు కూడా నిర్వహిస్తామన్నారు. దీని కోసం అండర్ 14, 16, 18, 20 బాల బాలికలు హాజరు కావచ్చుని పేర్కొన్నారు. పూర్తి వివరాల కోసం అథ్లెటిక్స్ కోచ్ విద్యాసాగర్ 8008090626 నెంబర్‌ను సంప్రదించాలని పేర్కొన్నారు.

ఉద్యోగ విరమణ ఉద్యోగులకు సన్మానం



నవతెలంగాణ-నస్పూర్

శ్రీరాంపూర్ ఏరియాలోని సింగరేణిలో వివిధ విభాగాల్లో పనిచేసి పదవీ విరమణ పొందుతున్న ఉద్యోగులను సోమవారం ఘనంగా సన్మానించారు. జనరల్ మేనేజర్ కార్యాలయంలో సర్వే విభాగంలో పనిచేసిన మనోహర్‌ను శ్రీరాంపూర్ ఏరియా జనరల్ మేనేజర్ బి సంజీవరెడ్డి, ఆర్కె-న్యూటెక్ గని సీనియర్ మైనింగ్ సర్దార్ డి. వీరాచారి, ఎస్పీ ముత్యాలరావు, టెండాల్ మాదాసు తిరుపతి, ఎంజెడబ్ల్యూ గందం రాజయ్యను ఎస్ఓ యం.స్వామిరాజు, ఆర్‌కే7 గని సీనియర్ మైనింగ్ సర్దార్ రవీందర్‌రెడ్డి, కోల్ కట్టర్ దుర్నేటి వెంకటస్వామి, రాసమల్ల బానయ్యను గని మేనేజర్ సాయిప్రసాద్, ఎస్ఆర్‌పి3 గని సీనియర్ మైనింగ్ సర్దార్ లింగం పరశురాములును డిప్యూటీ జనరల్ మేనేజర్ సంతోష్‌కుమార్ సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పదవీ విరమణ పొందిన ఉద్యోగులు తమ తదుపరి జీవితాన్ని కుటుంబ సభ్యులతో సంతోషంగా గడపాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో టీబీజీకేఎస్ ఏరియా ఉపాధ్యక్షుడు కేతిరెడ్డి సురేందర్‌రెడ్డి, ఆయా గనుల అధికారులు, యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత పాటించాలి

నవతెలంగాణ-లక్ష్మణచాంద



మండల కేంద్రంలో సోమవారం ఎంపీడీఓ శేఖర్ ఆధ్వర్యంలో పరిసరాల పరిశుభ్రత, పారిశుధ్య నిర్వహణ, డ్రై డే గురించి ఇంటింటికి తిరిగి పరిశీలించారు. కార్యక్రమంలో భాగంగా ఇంటింటికి తిరుగుతూ నిల్వ నీటిని తొలగిస్తూ అవగాహన కల్పించారు. నీరు నిల్వ ఉండడం వల్ల కలిగే అనర్థాల గురించి వివరించారు. డెంగీ దోమల నివారణ గురించి తెలిపారు. పరిసరాల పరిశుభ్రత పాటిస్తూ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని సూచించారు. మండల కేంద్రంలో పారిశుధ్య నిర్వహణ తీరును పరిశీలించి సిబ్బందికి తగు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీవో నసీరుద్దీన్, సీడీపీఓ నాగమణి, ఐసిడిఎస్ సూపర్వైజర్ భాగ్యవతి, ఐకేపి ఏపీఎం వాణిశ్రీ, పంచాయతీ కార్యదర్శి విక్రమ్‌రాజ్, ఆశా, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఖానాపూర్ : ప్రతి వర్షపు నీటి బొట్టును ఒడిసిపట్టి కాపాడాలని ఎంపీపీ మోహిత్ ఎంపీడీవో బాల మల్లేశం అన్నారు. సోమవారం మండలంలోని సుర్జాపూర్ సత్తెనపల్లి సేవా నాయక్ తండా గ్రామాలలో ఇంటికి పైకప్పు కింది భాగంలో ఇంకుడు గుంతలను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కలెక్టర్ ఆదేశాల మేరకు ఖానాపూర్ మండలంలోని ప్రతి గ్రామ పంచాయతీకి 15 చొప్పుల ఇంకుడు గుంతలు ఏర్పాటు చేయాలన్నారు. అంతేకాకుండా మండలంలో 360 ఏర్పాటు లక్ష్యమన్నారు. భూగర్భ జలాల పెంపు కోసం ప్రతి ఒక్కరూ వర్షపు నీరును నిల్వ ఉంచేలా ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

తల్లిపాల వారోత్సవాలు ఘనంగా నిర్వహించాలి

• ఆసిఫాబాద్ కలెక్టర్ బొర్కడే హేమంత్

నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లాలో తల్లిపాల వారోత్సవాలను ఘనంగా నిర్వహించాలని కలెక్టర్ బొర్కడే హేమంత్ అన్నారు. ఆగస్టు 1 నుండి 7 వరకు నిర్వహించనున్న తల్లిపాల వారోత్సవాలపై మహిళ సంక్షేమ శాఖ, గిరిజన సంక్షేమ శాఖ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో తల్లిపాల వారోత్సవాలను ఘనంగా నిర్వహించేలా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రులు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ఉప కేంద్రాలు, ప్రైవేటు ఆసుపత్రుల వైద్యాధికారులు, సిబ్బంది సంబంధిత శాఖల అధికారుల సమన్వయంతో వారోత్సవాలను విజయవంతం చేసే దిశగా కృషి చేయాలని తెలిపారు. ఉపాధ్యాయులు, అంగన్వాడి టీచర్లు, ఆశ కార్యకర్తలతో గ్రామాలలో ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. సంక్షేమ శాఖ సిడిపిఓలు, సూపర్ వైజర్లు తమ క్లస్టర్ పరిధిలో అంగన్వాడి సిబ్బందితో సమావేశాలు నిర్వహించి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని తెలిపారు. మండలాల వారీగా సమావేశం నిర్వహించి వైద్య సిబ్బంది భాగస్వామ్యంతో తల్లిపాల వారోత్సవాలను విజయవంతం చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి సావిత్రి, జిల్లా పరిషత్ సిఈఓ రత్నమాల, ప్రాజెక్టు అధికారులు, సూపర్వైజర్లు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

పూర్తిస్థాయి ఏర్పాట్లతో ఎన్నికలకు సిద్ధంగా ఉండాలి

జిల్లాలో పూర్తిస్థాయి ఏర్పాట్లతో ఎన్నికల నిర్వహణకు సిద్ధంగా ఉండాలని కలెక్టర్ బొర్కడే హేమంత్ అన్నారు. సోమవారం ఎస్పి సురేష్‌కుమార్‌తో కలిసి సిర్పూర్, ఆసిఫాబాద్ నియోజకవర్గాలలోని సెక్టార్, పోలీస్ అధికారులతో వచ్చే



సాధారణ శాసనసభ ఎన్నికలకు జిల్లాలు చేపట్టవలసిన చర్యలపై సమీక్షించారు. సెక్టార్ జోనల్ అధికారులుగా నియమించబడే అధికారులు తమ సెక్టార్ పరిధిలోని పోలింగ్ కేంద్రాలను సందర్శించి చేపట్టవలసిన పనులను గుర్తించి అవసరమైన చర్యలు తీసుకోవాలని తెలిపారు. సమస్యాత్మక, అత్యంత సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించాలని తెలిపారు. భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు జిల్లాలోని రెండు నియోజకవర్గాలలో 584 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందని, 78 రూట్లను ఏర్పాటు చేసి 78 మంది రూట్ అధికారులను నియమించడం జరిగిందని, అధికారులు వారి పరిధిలోని పోలింగ్ కేంద్రాలను సందర్శించి నెలకొన్న సమస్యలను గుర్తించి నివేదిక అందించాలని ఆదేశించారు. ఎన్నికల సంఘం నియమ నిబంధనలకు లోబడి ఎలాంటి నిర్లక్ష్యం వహించకుండా పనిచేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్పీ అచ్చేశ్వరరావు, ఆర్‌డిఓ రాజేశ్వర్, తహసీల్దారుల, సిఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

నేడు ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఛలో రాజ్‌భవన్



నవతెలంగాణ-నిర్మల్

నూతన విద్యావిధానం-2020 రద్దు చేయాలని ఆగస్టు 1న ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఛలో రాజ్‌భవన్ నిర్వహిస్తునట్లు ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి శీతల్కర్ అరవింద్ అన్నారు. సోమవారం ప్రజా సంఘాల కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దేశంలో రాజ్యాంగ స్ఫూర్తికి భిన్నంగా కేంద్ర ప్రభుత్వం నూతన జాతీయ విద్యావిధానం తీసుకొస్తోందన్నారు. ప్రభుత్వ విద్యకు నష్టం చేసి ప్రైవేట్, కార్పొరేట్ సెక్టార్‌కు లాభం చేసే చర్యలు తీసుకొస్తోందన్నారు. దీనిలో భాగంగా ప్రాథమిక విద్యారంగంలో డ్రాపౌట్స్ పెంచేలా మళ్లీ వర్ణ వ్యవస్థ, కుల వ్యవస్థ, తీసుకుని వచ్చే విధానాన్ని తీసుకొస్తోందని విమర్శించారు. పరిశోధన, ఫెలోషిప్ లేకుండా విదేశీ యూనివర్శిటీలే ఈ దేశంలోకి స్వేచ్ఛగా వచ్చే విధానాలు ఈ నూతన విద్యావిధానం పేరుతో అమలు చేయాలని చూస్తున్నారని విమర్శించారు. యూజీసీ రద్దు చేసి ప్రైవేట్, ప్రభుత్వ వ్యక్తుల భాగస్వామ్యంతో గవర్నింగ్ బాడీని తేవడం అంటేనే విద్యను పూర్తిగా ప్రైవేటీకరణ చేయడమని పేర్కొన్నారు. ఈ అన్ని అంశాలకు నిరసనగా ఛలో రాజ్‌భవన్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. సమావేశంలో జిల్లా అధ్యక్షులు నవీన్, జిల్లా ఉపాధ్యక్షుడు పరమేశ్వర్ పాల్గొన్నారు.

విద్యా ప్రమాణాలు పెంచడానికి కృషి చేయాలి

నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లాలోని పాఠశాలల్లో విద్యా ప్రమాణాలు పెంచడానికి ఉపాధ్యాయులు కృషి చేయాలని జిల్లా విద్యాధికారి అశోక్ తెలిపారు. జిల్లాలోని 31 పాఠశాలల్లో ఉపాధ్యాయులకు రెండు రోజులపాటు విద్యా ప్రమాణాల పెంపు, స్వీయ మూల్యాంకనం అంశాలపై అందించనున్న శిక్షణ కార్యక్రమాన్ని జిల్లా కేంద్రంలోని బాలికల ఉన్నత పాఠశాలలో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలు పెంచడానికి ఉపాధ్యాయులు నిరంతరం కృషి చేయాలన్నారు. విద్యార్థులకు చెబుతున్న చదువుపై ఎప్పటికప్పుడు స్వీయ మూల్యాంకనం చేసుకోవాలన్నారు. రెండు రోజుల శిక్షణ కార్యక్రమంలో తెలుసుకున్న అంశాలను నిత్య జీవితంలో వినియోగించుకోవాలన్నారు. శిక్షణ కార్యక్రమంలో భాగంగా ఏడు ప్రధాన ప్రమాణాలపై, 48 కీలక ప్రమాణాలపై అవగాహన కల్పించామని తెలిపారు. సమస్యల పరిష్కారం కోసం శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో క్వాలిటీ కోఆర్డినేటర్ ఉప్పులేటి శ్రీనివాస్, సమగ్ర శిక్ష



కోఆర్డినేటర్లు రాథోడ్ సుభాష్, స్వర్ణ, అబీదలి, ఏసీజి ఉదయబాబు, రిసోర్స్ పర్సన్ భిక్షపతి పాల్గొన్నారు.

శాంతిభద్రతాలు నెలకొల్పడానికే కార్డెన్ సెర్చ్

నవతెలంగాణ-కడెం

మండలంలోని కన్నాపూర్ గ్రామంలో ఖానాపూర్ సీఐ డి.మోహన్ ఆధ్వర్యంలో పోలీసులు సోమవారం కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాం నిర్వహించారు. ఈ ప్రోగ్రాంలో భాగంగా గ్రామంలోని ప్రతి ఇంట్లో సోదాలు నిర్వహించి సరైన అనుమతి పత్రాలు లేని 60 ద్విచక్రవాహనాలు, 4ఆటోలు, 2టాటా మ్యాజిక్‌లను స్వాధీనం చేసుకున్నారు. వాహనాల తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ వాహనదారులు ప్రతి ఒక్కరు తమ వాహనానికి సంబంధించిన అన్ని రకాల ధ్రువీకరణ పత్రాలు కలిగి ఉండాలన్నారు గ్రామంలో ఎవరైన అనుమానాస్పదంగా కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. పోలీసులు సమాచారం ఇచ్చిన వ్యక్తుల వివరాలను గోప్యంగా ఉంచుతారన్నారు. ముఖ్యంగా ప్రతి ఒక్కరూ డ్రైవింగ్ లైసెన్స్‌తో పాటు తమ వాహనానికి సంబంధించిన ఇన్సూరెన్స్ కల్గి ఉండాలన్నారు. సైబర్ మోసాల పట్ల అవగాహన కలిగి ఉండాలన్నారు. ఆన్లైన్ మోసాలకు గురైనట్లైతే వెంటనే సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్ నెంబర్ 1930కి కాల్ చేసి ఫిర్యాదు చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఖానాపూర్ సర్కిల్ పరిధిలోని నలుగురు ఎస్ఐలు, 35 మంది పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

కుమారుడి ఇంటికని వెళ్లి వాగులో గల్లంతు

• ఐదు రోజుల తర్వాత నీటిలో తేలిన మృతదేహం

నవతెలంగాణ-సిరికొండ



కుమారుడి ఇంటికి వెళ్లి వస్తానని వెళ్లిన ఓ వ్యక్తి వాగులో కొట్టుకుపోయి మృతి చెందిన సంఘటన మండలంలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని వాయిపేట్ గ్రామానికి చెందిన సంగం గంగాధర్(45) గురువారం ఉదయం ఇంట్లో నుండి బయలుదేరి గోపాల్‌పూర్ గ్రామంలో తన కుమారుడి వద్దకు వెళ్లి వస్తానని చెప్పాడు. రెండు గ్రామాల మధ్యలో వాగు ఉండడంతో వాగు దాటుతుండగా నీటి ప్రవాహం ఎక్కువ కావడంతో గల్లంతయ్యాడు. శుక్రవారం ఇంటికి రాకపోవడంతో సాయంత్రం కుటుంబ సభ్యులు పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేశారు. పోలీసులు ఐదు రోజులుగా గాలింపు చర్యలు చేపట్టారు. సోమవారం మధ్యాహ్నం సమయంలో చింతగూడ గ్రామ సమీపంలోని వాగులో చెట్టు తొర్రలో చిక్కుకున్న మృతదేహాన్ని గ్రామస్తులు చూసి పోలీసులకు సమాచారం అందజేశారు. ఏఎస్ఐ అశోక్‌రెడ్డి తన సిబ్బందితో కలిసి సంఘటన స్థలానికి చేరుకొని వాగులో నుండి మృతదేహాన్ని గజఈత గాళ్లతో బయటకు తీయించారు.

పర్సునంబాల పాఠశాలలో అక్రమాలపై విచారణ జరపాలి

నవతెలంగాణ-ఆసిఫాబాద్

మండలంలోని పర్సునంబాల ప్రాథమిక ఉన్నత పాఠశాలలో గత ప్రధానోపాధ్యాయుని హయాంలో జరిగిన అక్రమాలపై విచారణ జరపాలని ప్రస్తుత ప్రధానోపాధ్యాయుడు దేవాజి ఎంఈఓకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత విద్యా సంవత్సరంలో ప్రధానోపాధ్యాయునిగా పనిచేసిన కుమార్ పాఠశాల నిధుల్లో నుండి క్రీడా పరికరాలు కొనుగోలు చేసినట్లు రూ.10వేలు బిల్లులు పెట్టి విత్ డ్రా చేశాడని అన్నారు. పాఠశాలకు ఎటువంటి క్రీడా పరికరాలు కొనుగోలు చేయలేదని తెలిపారు. దీనిపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని కోరారు.

విద్యార్థుల అభ్యాసన సామర్థ్యాలను పెంపొందించడానికి కషి చేయాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

విద్యార్థుల అభ్యాసన సామర్థ్యాలను పెంపొందించడానికి, వారిని ఉన్నతులుగా తీర్చిదిద్దడానికి ఉపాధ్యాయులందరూ కృషి చేయాలని, వారికి అర్థమయ్యేరీతిలో బోధించాలని జిల్లా విద్యాశాఖ అధికారిణి ప్రణీత అన్నారు. పట్టణంలోని డైట్ కళాశాలలో సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో శాలసిద్ధి కార్యక్రమంలో భాగంగా రెండు రోజులపాటు నిర్వహించే శిక్షణా తరగతులను సోమవారం ఆమె ప్రారంభించారు. బోధన అభ్యాసంపై ఉపాధ్యాయులకు దిశానిర్దేశం చేశారు. ప్రయివేటుకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో కనీస మౌళిక సదుపాయాలు కల్పించడంతోపాటు బోధన పద్ధతులను మార్చాలన్నారు. విద్యార్థులకు అర్థవంతంగా, సులభతరంగా బోధించి ఉత్తమ ఫలితాలు సాధించేలా ఉపాధ్యాయులు కీలక భూమిక పోషించాలన్నారు. అలాగే విద్యార్థుల సంఖ్యను పెంచాలన్నారు. అందుకోసం ఈ శిక్షణా తరగతులు ఎంతగానో దోహదపడతాయని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసేందుకు ప్రభుత్వం అనేక కార్యక్రమాలు చేపడుతోందన్నారు. అందులో భాగంగానే శాలసిద్ధి కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందని పేర్కొన్నారు.

తోటి స్నేహితుల ఔదార్యం

నవతెలంగాణ-లక్ష్మణచాంద



మండలంలోని వడ్యాల్ గ్రామానికి చెందిన అయిండ్ల ముత్తన్న వారం రోజుల క్రితం గుండెపోటుతో మరణించారు. మృతుని కుటుంబ ఆర్థిక పరిస్థితి బాగాలేకపోవడంతో అతనితో పాటు పదవ తరగతి చదివిన 2005-06 సంవత్సరం బ్యాచ్‌కు చెందిన మిత్రులు కలిసి సోమవారం పరామర్శించి రూ.45,500 ఆర్థిక సాయం అందించారు. తోడుగా ఉంటామని భరోసానిచ్చారు. తోటి స్నేహితుని కుటుంబానికి సహాయం చేసిన మిత్రులను పలువురు అభినందించారు.

పత్తి పంట పరిశీలన

నవతెలంగాణ-పెంచికల్‌పేట్

మండలంలోని చెడ్వాయి, గన్నారం శివారులోని పత్తి పంటను వ్యవసాయ విస్తరణ అధికారులు గౌసియాబేగం, లావణ్య పరిశీలించారు. భారీ వర్షాల కారణంగా వరద ముంపుకు గురైన ప్రాంతాల్లో పత్తి పంటను పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులకు పలు సూచనలు చేశారు. ముంపుకు గురైన ప్రాంతాల్లో చేనులో నిలిచిన నీటిని బయటకు పంపించాలని, మొక్కలపై నీటిని పిచికారి చేయడం ద్వారా వాటిపై ఉన్న మట్టి తొలగిపోతుందన్నారు. పత్తి మొక్కలకు 19:19:19 మల్టీకె 10 గ్రాములు లేదా యూరియా 20 గ్రాములు లీటరు నీటిలో కలిపి వారంలో రెండుసార్లు పిచికారి చేయాలని రైతులకు సూచించారు. అధిక వర్షాలు ఉండడం వల్ల వడులు తెగులు వచ్చే అవకాశముందని, దాని నివారణకు కాపర్ ఆక్సిక్లోరైడ్ మూడు గ్రాములు లీటరు నీటిలో కలిపి మొక్క కాండం తడిచే విధంగా పిచికారి చేయాలని సూచించారు. మండలంలోని ఎల్లూరు గ్రామంలో ఏఈఓ లావణ్య కొత్త పోడు పట్టాలు వచ్చిన రైతుల నుండి రైతుబీమా దరఖాస్తులను స్వీకరించారు. కార్యక్రమంలో ఎల్లూరు సర్పంచ్ రాజన్న, కోఆప్షన్ సభ్యుడు సాజిద్, మల్లేష్, బాపు, రాధాకృష్ణ పాల్గొన్నారు.

మహిళా సంఘాల భవన నిర్మాణపు పనులు ప్రారంభం

నవతెలంగాణ-జైపూర్

మండల పరిధి షెట్‌పల్లి గ్రామ పంచాయతీలో మహిళా సంఘాల(సమ్మక్క సారలమ్మ) భవన నిర్మాణపు పనులు సోమవారం ప్రారంభించినట్లు సర్పంచ్ మేడి రవి తెలిపారు. ప్రభుత్వ పరంగా మంజూరైన రూ.20లక్షలతో భవన నిర్మాణ పనులు పూర్తి చేయనున్నట్లు పేర్కొన్నారు.

ఐక్యంగా ఉంటూ సమస్యలు పరిష్కరించుకోవాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఐక్యంగా ఉంటూ సమస్యలను పరిష్కరించుకోడానికి సంఘ నాయకులు కృషి చేయాలని మున్సిపల్ చైర్మన్ జోగు ప్రేమేందర్ సూచించారు. ఇటీవల ఆచారి సంఘం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకోగా సోమవారం సంఘ భవనాన్ని ఏర్పాటు చేశారు. ఈ మేరకు ఏర్పాటు చేసిన కార్యక్రమానికి చైర్మన్ ముఖ్య అతిథిగా హాజరై సంఘ భవనాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ సంఘ భవన నిర్మాణానికి తమ వంతుగా రెండు లక్షల రూపాయలు అందిస్తామని భరోసా కల్పించారు. సభ్యులు ఎదుర్కొనే పలు సమస్యల పరిష్కారానికి నాయకులు కృషి చేయాలని, ఐక్యంగా ఉంటూ పురోగతి సాధించాలని సూచించారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షులు దేవన్న, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షులు అలాల్ అజయ్, కౌన్సిలర్ ప్రకాష్, నాయకులు జాలిల్ పాషా, ఫిరోజ్, గంగన్న పాల్గొన్నారు.

నేటి నుంచి 11వరకు డిగ్రీ రిజిస్ట్రేషన్

నవతెలంగాణ-ఇచ్చోడ

మండల కేంద్రంలో నూతనంగా ఏర్పటు కానున్న డిగ్రీ కళాశాలలో చేరడానికి దోస్త్ ఆన్‌లైన్ ద్వారా అడ్మిషన్లు జరుగుతున్న సందర్భంగా ఆగస్టు 1నుంచి 11 వరకు ఆన్‌లైన్ నమోదు చేసుకొనే అవకాశం ఉంది. బి.ఎ, బికాం, కంప్యూటర్స్, బిఎస్సి ఫిజికల్ సైన్సు, బిఎస్సి లైఫ్ సైన్సు కోర్సులు అందుబాటులో ఉన్నట్లు దోస్త్ వెబ్‌సైట్‌లో కన్పిస్తున్నాయి. ఇంటర్ పూర్తి చేసుకున్న విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని అధికారులు పేర్కొంటున్నారు.

జనరల్ డిగ్రీ కళాశాలను బోథ్‌లో ఏర్పాటు చేయాలని తీర్మానం



నవతెలంగాణ-బోథ్

బోథ్ మండల కేంద్రంలోనే జనరల్ డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలని బోథ్ గ్రామపంచాయతీ పాలకవర్గం తీర్మానం చేసింది. మంగళవారం ఏర్పాటు చేసిన జనరల్ బాడీ సమావేశంలో పలు సమస్యలపై తీర్మానాలు చేశారు. మండలాన్ని రెవెన్యూ డివిజన్‌గా ఏర్పాటు చేయాలని, ఏజెన్సీ ప్రాంతమైన ఇచ్చోడకు కేటాయించిన జనరల్ డిగ్రీ కళాశాలను మండల కేంద్రంలో ఏర్పాటు చేయాలని తీర్మానించారు. ఆదిలాబాద్‌లో నిర్వహించబడుతున్న గిరిజన డిగ్రీ కళాశాలను ఇచ్చోడ కేంద్రంలో ఏర్పాటు చేయాలని తీర్మానించారు.

కేజీబీవీని సందర్శించిన తహసీల్దార్



నవతెలంగాణ-దస్తురాబాద్

పరిసరాల పరిశుభ్రత పాటించాలని తాహసీల్దార్ లక్ష్మీ అన్నారు. సోమవారం కేజీబీవీ పాఠశాలను సందర్శించి పలు రికార్డులను పరిశీలించారు. వంట కార్మికులకు పరిశుభ్రత పాటించాలని, నాణ్యమైన కూరగాయలతో రుచికర భోజనాన్ని అందించాలని సూచించారు. విద్యార్థులకు సీజనల్ వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు పాటించాలని తెలిపారు.

ఎస్సైకి బీజేపీ నాయకుల సన్మానం

నవతెలంగాణ-బాసర

ఎస్ఐ గణేష్‌ను సోమవారం బీజేపీ నాయకులు శాలువాతో సత్కరించి అమ్మవారి ఫోటోను అందజేశారు. కార్యక్రమంలో బీజేవైఎం జిల్లా ప్రధాన కార్యదర్శి సాయినాథ్ పటేల్, మండల బిజెపి అధ్యక్షుడు లక్ష్మారెడ్డి, బిజెపి పట్టణ అధ్యక్షుడు సుభాష్ యాదవ్ పాల్గొన్నారు.

వాగయ్యకు పాల్వాయి పరామర్శ

నవతెలంగాణ-చింతలమానేపల్లి

ప్రమాదవశాత్తు ఎడ్లబండి పైనుండి పడి గాయలపాలైన మండలంలోని గూడెం గ్రామానికి చెందిన సాయిరి వాగయ్యను సోమవారం బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డా.పాల్వాయి హరీష్‌బాబు పరామర్శించారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఆయన వెంట మాజీ జెడ్పీటీసీ ఎల్ములే మల్లయ్య, సర్పంచ్ చౌదరి నానయ్య, మాజీ సర్పంచ్ పేదం సుధాకర్, నాయకులు పురుషోత్తంచారి, డోంగ్రే నానాజీ, చాప్లె సత్తయ్య, శ్రీమన్నారాయణ, రౌతు లచ్చన్న, కుకాడకర్ రమేష్ ఉన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన మండల సాధన కమిటీ సభ్యులు

నవతెలంగాణ-తలమడుగు

మండలంలోని భరంపూర్ గ్రామాన్ని కొత్త మండలంగా ఏర్పాటు చేయాలంటూ మండల సాధన కమిటీ సభ్యులు సోమవారం ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు నివాసంలో కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు మాట్లాడుతూ కొత్త మండల సమస్యను సీఎం దృష్టికి తీసుకెళ్లి సమస్యను వివరిస్తానని అన్నారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో కమిటీ సభ్యుడు బొల్లారపు బాబన్న, పీఏసీఎస్ చైర్మెన్ శ్రీనివాస్‌రెడ్డి, సర్పంచ్‌లు కిష్టన్న, రమేష్‌రెడ్డి, బోథ్ నియోజకవర్గ అధికార ప్రతినిధి మొట్టె కిరణ్ కుమార్, మండల కన్వీనర్ తోట వెంకటేష్, మేకల మల్లన్న, ఆ పార్టీ నాయకులు సత్యనారాయణ, శాస్త్రి, రాజేశ్వర్, గంగన్న, విఠల్, నర్సింలు, గోవర్ధన్‌రెడ్డి తదితర గ్రామాల ప్రజలు ఉన్నారు.

జీఓ నెంబర్ 81 రద్దు చేయాలి

నవతెలంగాణ-లక్ష్మణచాంద

రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ప్రవేశపెట్టిన జీఓ నెంబర్ 81 రద్దు చేయాలని కోరుతూ మండల కేంద్రంలో సోమవారం మండల వీఆర్‌ఏలు, సాదారులు తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. బీఆర్‌ఏలను ఒక్కరిని మాత్రమే క్రమబద్ధికరిస్తూ మిగతా వారి ఉపాధికి గండి కొడుతూ వారిని రోడ్డున పడేయడం సరి కాదని పేర్కొన్నారు. ఇన్ని రోజులు రెవిన్యూ కార్యాలయంలో సేవ చేసిన తమకు అన్యాయం జరుగుతుందని వాపోయారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వీఆర్‌ఏలను క్రమబద్ధికరిస్తూ తెచ్చిన జీఓ నెంబర్ 81ను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో పోరాటం మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అర్థంలేని జీఓలు తెచ్చి ప్రజల మధ్యలో చిచ్చు పెడుతున్నారని అన్నారు.

డబ్ల్యూపీఎస్ సీఐగా శ్రీనివాస్ బాధ్యతలు



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఇటీవల ఆదిలాబాద్ జిల్లాలోని డబ్ల్యూపీఎస్ సర్కిల్ ఇన్స్‌పెక్టర్ సాధారణ బదిలీలో బదిలీ కాగా ఆ స్థానంలో రాజన్న సిరిసిల్ల జిల్లా నుంచి జి.శ్రీనివాస్ ఇటీవల బదిలీపై మహిళా పీఎస్ ఇన్స్‌పెక్టర్‌గా పోస్టింగ్స్ కల్పిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ డి ఉదయ్ కుమార్ రెడ్డిని సోమవారం మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. 2012 ఎస్సై బ్యాచ్‌కి సంబంధించిన జి శ్రీనివాస్, బోయిన్‌పల్లి, మధిర రూరల్, వైరాటౌన్, మంచిర్యాల, నెన్నెల పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వర్తించి, ఇటీవలే పదోన్నతి పొంది మహిళా పోలీస్‌స్టేషన్‌కు ఇన్స్‌పెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించారు.

మహిళా ఫిర్యాదుదారుల పట్ల గౌరవంగా వ్యవహరించాలి

ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ మహిళా ఫిర్యాదుదారుల పట్ల గౌరవంగా వ్యవహరిస్తూ సమస్య పరిష్కరించే దిశగా హామీ ఇస్తూ, బాధితులకు ధైర్యాన్ని కల్పిస్తూ విధులు నిర్వర్తించాలని సూచించారు. ఎటువంటి పెండెన్సీ లేకుండా చూడాలని అన్నారు. దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న కేసులను పూర్తి చేయాలని సూచించారు. బాధితులకు కుటుంబ సభ్యులకు కౌన్సిలింగ్ నిర్వహిస్తూ సామరస్యంగా ఎటువంటి పక్షపాతం లేకుండా విధులను నిర్వర్తించాలని సూచించారు. కార్యక్రమంలో సీసీ దుర్గం శ్రీనివాస్, స్పెషల్ బ్రాంచ్ ఇన్స్‌పెక్టర్ జె. కృష్ణమూర్తి, ఎస్సై అన్వర్ పాల్గొన్నారు.

అభివృద్ధి అంటున్నారు..పనులు అడ్డుకుంటున్నారు..



నవతెలంగాణ-ఉట్నూర్

ఐటీడీఏ పరిధిలోని పలు గ్రామాలకు రోడ్డు నిర్మాణాలు, వంతెన వంటి అభివృద్ధి పనులు చేస్తున్నామని చెబుతూ మరో వైపు పనులను చట్టాల సాకుతో అడ్డుకుంటున్నారని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ నాయకుడు పెందుర్ ప్రభాకర్ పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సోమవారం ఐటీడీఏకు వెళ్లి పీఓ చాహత్ బాజ్ పాయ్‌ని కలిసి విన్నవించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐటీడీఏలోని సీసీడీపీ ద్వారా కోట్లాది రూపాయలతో పలు అభివృద్ధి పనులు చేస్తున్నామని ప్రభుత్వం, అధికారులు గొప్పలు చెబుతున్నారని అన్నారు. అటవీ హక్కు చట్టం పేరుతో ఆ పనులు అడ్డుకుంటున్నారని పీఓ దృష్టికి తీసుకెళ్లారు. వర్షాకాలం వచ్చిందంటే గిరిజనులు గ్రామాలకు సరైన రోడ్డు సౌకర్యం లేకపోవడంతో చాలా ఇబ్బంది పడుతున్నారని అన్నారు. పీఓ సానుకూలంగా స్పందించి వీటిపై పూర్తి వివరాలు తెలుసుకొని సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఆయన వెంట నాయకులు ఉన్నారు.

కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డిని కలిసిన మాలీలు



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

మాలీలకు ఎస్టీ హోదా కల్పించాలని కోరుతూ మాలీ మహా సంఘం రాష్ట్ర అధ్యక్షులు సుకుమార్ పెట్కులే ఆధ్వర్యంలో ఉమ్మడి ఆదిలాబాద్ మాలీ కులస్తులు హైదరాబాద్‌లో కేంద్రమంత్రి కిషన్ రెడ్డిని సోమవారం కలిశారు. ఈ సందర్భంగా సుకుమార్ పెట్కులే మాట్లాడుతూ 2017 ఏప్రిల్ 16న అప్పటి బీజేపీ శాసనసభ పక్ష నేతగా ఉన్న కిషన్‌రెడ్డి మాలీల పక్షాన నిలబడి అసెంబ్లీలో మాలీలకు ఎస్టీ హోదా కల్పించాలని డిమాండ్ చేయడంతోనే సీఎం కేసీఆర్ స్పందించి తీర్మానం చేసి కేంద్రానికి పంపారని అన్నారు. కానీ అప్పుడు ముస్లిం రిజర్వేషన్లతో కలిపి ఎస్టీ రిజర్వేషన్ బిల్లును ఒకే దాంట్లో పంపడం చేత అది ఆమోదానికి నోచుకోలేదని అన్నారు. ఆ తర్వాత తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రెండోసారి 10 ఫిబ్రవరి 2023న తీర్మానం చేసి కేంద్రానికి ఆమోదం కోసం పంపించారని అన్నారు. మంత్రిగా ఉన్న కిషన్‌రెడ్డి కేంద్రాన్ని ఒప్పించి పార్లమెంటులో బిల్లు ప్రవేశపెట్టి ఆమోదముద్ర వేయించి జీవో విడుదల చేయాలని కోరగా స్పందించిన మంత్రి కిషన్ రెడ్డి వెంటనే ఈ విషయమై చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో నాయకులు విజయ్ వాడగూరే, గంగారాం శేండే, శేండే నారాయణ, తులసీరామ్ కావుడే, ఆదే నారాయణ, శివరాం నాగోషే, రామ్ కిషన్ శేండే, లచ్చన్న గురునులే, వినోద్ గురునులే, గంగారాం శేండే, హుస్సేన్ పేటకులే, జయరాం చౌదరి, శివాజీ పెట్కులే, విలాస్ శేండే, గజానన్ చౌదరి పాల్గొన్నారు.

ఉద్యోగ విరమణ పొందిన ఉద్యోగికి సన్మానం



నవతెలంగాణ-రెబ్బెన

సోమవారం బెల్లంపల్లి ఏరియాలోని ఖైరిగూడ ఓసీపీలో పనిచేస్తున్న సింగరేణి సంస్థలో 37 సంవత్సరాల సర్వీస్ పూర్తిచేసిన దండనాయకుల దత్తాత్రేయరావు పదవి విరమణ పొందిన సందర్భంగా సన్మాన కార్యక్రమం అట్టహాసంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా గని మేనేజర్ ప్రవీణ్ పాంటింగ్ పాల్గొని మాట్లాడుతూ పదవి విరమణ పొందిన ఉద్యోగిని, ఆయన చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో రక్షణ అధికారి రాజేశ్వర్‌రావు, వెల్ఫేర్ ఆఫీసర్ వేణు, టీబీజీకేఎస్ ఫిట్ సెక్రటరీ కార్నాదం వెంకటేశం, టీబీజీకేఎస్ జీఎం కమిటీ మారిన వెంకటేశ్వర్లు, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

ఘనంగా టీజీవీపీ 11వ ఆవిర్భావ దినోత్సవం

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

తెలంగాణ విద్యార్థి పరిషత్ 11వ ఆవిర్భావ దినోత్సవం పురస్కరించుకొని విద్యార్థి పరిషత్ నాయకులు, కార్యకర్తలు, విద్యార్థులు సోమవారం జిల్లా కేంద్రంలో ఘనంగా నిర్వహించుకున్నారు. ముందుగా పట్టణంలోని అమరవీరుల స్థూపం ముందర జిల్లా అధ్యక్షుడు చేతుల మీదుగా టీజీవీపీ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఆర్గనైజేషన్ సెక్రటరీ ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ తెలంగాణ విద్యార్థి పరిషత్ ఉద్యమాలలో పురుడోసుకొని విద్యార్థి ఉద్యమాలే ధ్యేయంగా ముందుకు వెళ్తున్న సంస్థ తెలంగాణ విద్యార్థి పరిషత్ అని తెలిపారు. ఎల్లప్పుడూ విద్యార్థులకు అండగా నిలుస్తుందని అన్నారు. విద్యార్థుల పక్షాన పోరాడుతూ విద్యార్థులకు కావాల్సినవి, రావాల్సిన అన్ని రకాల మౌలిక వస్తువుల కల్పన కోసం ప్రభుత్వాలతో పోరాటం చేస్తూ ఎల్లప్పుడు ముందు వరుసలో ఉంటుందని తెలిపారు. ఇలాంటి కుల మత రాజకీయాలు చేయకుండా ఇలాంటి రాజకీయ పార్టీతో సంబంధం లేకుండా ఎల్లవేళలా విద్యార్థుల సంక్షేమ ధ్యేయంగా టీజీవీపీ పనిచేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమలో పట్టణ నాయకులు, బోథ్ నియోజకవర్గ కన్వీనర్ గొర్ల నరేందర్ యాదవ్, కోకన్వీనర్ ఉల్లెంగుల సతీష్ కుమార్, సీనియర్ నాయకులు అవునూరు శ్రీనివాస్, సీనియర్ నాయకులు పసుపుల సంతోష్ పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలను సందర్శించిన డీఈఓ

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఆదిలాబాద్ పట్టణంలోని పలు ప్రభుత్వ పాఠశాలలను జిల్లా విద్యాధికారి టీ ప్రణీత సోమవారం సందర్శించారు. ఇందులో భాగంగా స్థానిక సరస్వతినగర్‌లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలను సందర్శించి రీడింగ్ కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో పాఠాలను చదివించారు. అనంతరం భీంపూర్ కేజీబీవీని సందర్శించారు. వంటగదిని సందర్శించి, వస్తువులను పరిశీలించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని అన్నారు. ఆమె వెంట విద్యాశాఖ అధికారులు ఉన్నారు.

ఘనంగా కృతజ్ఞత ర్యాలీ



నవతెలంగాణ- ఇచ్చోడ

నేరడిగొండ, గుడిహత్నూర్, బజార్‌హత్నూర్, సిరికొండ మండలాలకు కేంద్ర బిందువుగా ఉన్న ఇచ్చోడ మండల కేంద్రంలో జనరల్ డిగ్రీ కళాశాల ఏర్పాటుకు కృషి చేసిన బోథ్ ఎమ్మెల్యే రాథోడ్ బాపురావుకు ఐదు మండలలా ప్రజల తరుపున సోమవారం బీఆర్‌ఎస్ నాయకులు కలిసి కృతజ్ఞత ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సభ్యులు పెరమాండ్ల స్వామి మాట్లాడుతూ ఇచ్చోడ మండల కేంద్రం ముఖ్య రాజకీయ, వ్యాపార కేంద్రమని అన్నారు. అన్ని రకాల ప్రభుత్వ కార్యాలయాల ఏర్పాటుకు అనువైన ప్రదేశమని అన్నారు. ప్రధానమైన కార్యాలయలు ఇచ్చోడలో ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కోసం త్వరలోనే కార్యాచరణ ప్రకటిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల కన్వీనర్ ఏనుగు కృష్ణారెడ్డి, మాజీ ఎంపీపీ దుర్రే సుభాష్ పటేల్, ఆత్మ చైర్మెన్ నరాల రవీందర్, జాకీర్, ప్రవీణ్ రెడ్డి, గణేష్, అలీం, మహేష్, దత్తు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా రోడ్డు

నవతెలంగాణ-వాంకిడి

మండలకేంద్రంలో డీబిఎల్ కంపెనీ చేపడుతున్న నాలుగు వరుసల రహదారిలో భాగంగా నిర్మిస్తున్న రోడ్డు ప్రమాదకరంగా మారింది. వాహనాలు ఒకవైపు నుండే రాకపోకలు కొనసాగిస్తుండడంతో ద్విచక్ర వాహనాలు, లారీలతో పాటు ఇతర వాహనాలు ప్రయాణం చేయాలంటే ఇబ్బందులు పడాల్సి వస్తుంది. రెండు వైపుల అప్రోచ్‌రోడ్డు నిర్మించకపోవడంతో ఒకప్రక్క నుండే వాహనాలు వెళ్లడంతో ప్రమాదకరంగా మారింది. రోడ్డుకు మురికి కాలువలు నిర్మించి కొంత నిర్మించకపోవడంతో రోడ్డు మొత్తం కూలిపోయి ప్రమాదకరంగా ఉంది. ఇప్పటికైనా డీబీఎల్ కంపెనీ ప్రమాదకరంగా మారిన రోడ్డుకు మరమ్మత్తులు చేయాలని, లేనిపక్షంలో ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని స్థానికులు కోరుతున్నారు.

జీపీ కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలి



నవతెలంగాణ-రెబ్బెన

పంచాయతీ కార్మికుల సమస్యలు వెంటనే పరిష్కరించాలని ఏఐటీయూసీ కార్యదర్శి బోగె ఉపేందర్ అన్నారు. మండల కేంద్రంలో గ్రామ పంచాయతీ కార్మికుల సమ్మె సోమవారం 26వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ పంచాయతీ కార్మికుల న్యాయమైన సమస్యలను వెంటనే పరిష్కరించాలని, లేనిపక్షంలో అసెంబ్లీని ముట్టడిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్మికులు, జేఏసీ నాయకులు నాగవెల్లి సుధాకర్, దుర్గం వెంకటి, శంకర్, బాలాజీ, ప్రకాష్, దేవాజీ, లక్ష్మణ్, సత్యనారాయణ, లక్ష్మి, శోభ పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి

సిరికొండ : తమ గ్రామాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సోమవారం జిల్లా కేంద్రంలోని కలెక్టర్ కార్యాలయంలో ప్రజావాణిలో రాంపూర్(బి) సర్పంచ్ తంబారే రేణుక, ఉపసర్పంచ్ ప్రహ్లాద్, వార్డు సభ్యులు కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు కురిసిన వర్షాలతో రోడ్లు మొత్తం కొట్టుకుపోయయని అన్నారు. రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని అన్నారు. నిత్యం మండల కేంద్రానికి పనుల నిమిత్తం వెళ్లాలంటే చాలా కష్టంగా ఉందని అన్నారు. వ్యవసాయ పంట పొలాల్లో విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయని అన్నారు. ప్రతి సంవత్సరం వర్ష కాలంలో విద్యుత్ స్తంభాలు తమ పంట పొలాల్లో విరిగి పడి పోతున్నాయని అన్నారు. మిషన్ భగీరథ నీళ్లు రావడం లేదని అన్నారు. ఇంటింటికి నల్ల కనెక్షన్లు లేవని అన్నారు. తమ సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నీలకంఠ్, విష్ణు, మనోజ్, విలాస్ పాల్గొన్నారు.